విడి ప్రతి రూ.15/-

అక్టోబర్ 2010

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఆయన నిబంధనను గైకొనుచు ఆయన కట్టడల ననుసరించి
నడచుకొను వారిమీద యెహోవాయందు భయభక్తులు గలవారిమీద
ఆయన కృప యుగయుగములు నిలుచును.

కీర్తన 103:17,18





# "ఆరార్కే" గారి తొలిపలుకు, ప్రార్థన

పాఠకులారా బాగున్నారా? పరిస్థితులెలా ఉన్నాయి? పరిస్థితులు మీ కింద ఉన్నాయా? లేక మీరు పరిస్థితుల కింద ఉన్నారా? కష్టాలు మిమ్ములు్ను చుట్టుముట్టినపుడు మీ ఆనందాన్ని పోగొట్టుకోకండి. ప్రభువునందలి ఆనందం మిమ్ములు్ను బలపరుస్తుంది. నెహెమ్యా 8.10 తో మిమ్ములు్ను ఆహ్వానిస్తున్నాము.

***"యెహోవాయందు ఆనందించటం వలన మీరు బలమొందుతారు."*** రండి ప్రార్థన చేసుకుందాము.

– పరిశుద్ధ తండ్రీ, పరలోక దేవా, నీకు స్తుతులు స్తోత్రములు. దేవా, నీ అద్భుతాలు ఎంతో ఘనమైనవి. నీ కార్యములు సత్యములు, నీ మార్గములు న్యాయమైనవి. నమ్మదగిన దేవా, మహిమాన్వితుడవైన మా పరమ తండ్రీ, నీకు స్తుతులు స్తోత్రములు. యేసుక్రీస్తునందు నీవు మాకనుగ్రహించిన నిత్యజీవము కొరకై మీకు కృతజ్ఞులం. మా పాఠకులనూ వారి కుటుంబాలను, పిల్లలను ఆయురారోగ్యములిచ్చి ఆశీర్వదించండి. మహిమగలిగిన మా తండ్రీ, మా దేశమును ఆశీర్వదించి స్వస్థపరచండి. దేశ ప్రభుత్వమును దీవించండి. ప్రజోపయోగకరములైన ఉద్యమాలను బలపరచండి. నీ బిడ్డలను కనికరముతో కూడిన సత్కార్యములు చేయటానికి వారిని ప్రేరేపించండి. క్రీస్తునందు మీరు వాగ్దానము చేసిన ప్రతి ఆధ్యాత్మిక ఆశీర్వాదమును మీ బిడ్డలు స్వతంత్రించుకొనేటట్లు వారి పక్షముగా ప్రార్థన చేస్తున్నాము. సంఘ సువార్త సేవయందు ఉజ్జీవము రావాలని విజ్ఞాపన చేస్తున్నాము. రోగులను మీ స్వస్థతా హస్తముతో స్పృశించండి. వికలాంగులను దిక్కులేని అనాథలను పరామర్శించటానికి మీ బిడ్డలను పురికొల్పండి. సంఘమందు, క్రైస్తవ కుటుంబములందు ఆరాధన ఉజ్జీవమును ప్రసాదించండి. మా జీవమునకు, భక్తికి అవసరమయిన హెచ్చరికలు మాకనుగ్రహించండి. నిరాశానిస్పృహలలో ఉన్నవారికి క్రీస్తునందు ధైర్యము, నిరీక్షణ వలన ఉత్సాహము కలిగించండి. నిరుపేదలను ఆదరించండి. నీ రాజ్యము త్వరలో రావడానికి దోహదపడే క్రియలు నీ సంఘము విరివిగా చేయగలుగునట్లు ఆత్మ నింపుదల, నడుపుదల అనుగ్రహించండి దేవా. సైతానీయ శోధనలను జయించే విశ్వాస బలము, కృపాబలము నీ బిడ్డలకు అనుగ్రహించండి. మీ కృపలో మమ్ములనందరినీ భద్రపరచండి, మీ రాకడకై సిద్ధపరచండి. క్రైస్తవ సహోదరత్వమందు గొప్ప ప్రేమ ఉజ్జీవము రావాలని ఎంతగానో ప్రార్థిస్తున్నాము. ప్రియ దేవా, మమ్ములను దాతృత్వమందు వర్ధిల్లచేయండి. సంఘ బిడ్డలకు సహనశీలము, మనోధైర్యము, పరిస్థితులను అధిగమించిన స్థితప్రజ్ఞ, ఏకాగ్రత, నిత్యానందము, వినయము అనుగ్రహించి, వారిని నీ రాజ్యము కోసమై ప్రయోజనకారులుగా తీర్చిదిద్దండి. సువార్త ప్రకటన విధానాలలో కూడా ఉజ్జీవం రావాలని ప్రార్థిస్తున్నాము. విశ్వాసుల సాక్ష్యమును బట్టి అనేకులు నీ వైపునకు ఆకర్షించబడునట్లు వారి వ్యక్తిగత జీవితాలను నూతన పరచుమని ఈ సంచిక పఠనలో మాకు మరిన్ని అనుభవాలు అనుగ్రహించుమని యేసుక్రీస్తువారి శక్తిభరిత నామమున ప్రార్థిస్తున్నాము తండ్రీ, ఆమెన్.

*(ప్రియ పాఠకులారా ఈ ప్రార్థనల నమూనా రేడియోలో విని నా చిన్నతనంలో, 19సం॥ల ప్రాయంలో రాసుకున్నవి. నన్నెంతగానో బలపరచిన ప్రార్థనలు, మీరూ అవలంభించండి. మీ ప్రార్థనలు అర్థవంతంగా, శక్తివంతంగానూ ఉండటం మాత్రమే గాక మంచి భాషకూడా మీకు అలవడుతుంది.*

*ప్రార్థించండి, సమృద్ధి ప్రయోజనాన్ని అనుభవించండి.*

*– మీ ఎడిటర్)*

1976 - 2010 34 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన

ఆధ్యాత్మిక మాస పత్రిక

*The largest circulated Telugu Christian monthly since 34 years*

అక్టోబర్ 2010 సంపుటి 34 సంచిక 10


## ఈ సంచికలో..


| | |
|---|---|
| సబ్బాతు వాగ్దానం | 6 |
| బైబిలు యువకులు | 8 |
| ప్రశంశా పత్రం | 10 |
| పరలోక ధనము | 12 |
| అన్యాయపు సిరి | 14 |
| క్రీస్తులేని క్రైస్తవ్యం | 16 |
| పాప పరిష్కారం | 18 |
| క్లుప్త ప్రసంగాలు | 20 |
| భలే బొంగరం | 22 |
| బైబిల్‌లోని పేర్లు | 24 |
| నిర్గమకాండము | 25 |
| ప్రకటన గ్రంథం | 28 |



వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు:
ఆచార్య ఆరార్కె మూర్తి

ప్రచురణకర్త, సంపాదకులు:
డా॥ దేవసహాయం దండల

సహకారం:
పాస్టర్ పి. సురేశ్ బాబు

సంపాదక వర్గం:
పాస్టర్ జి. దేవరాజు, బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, బ్రదర్ ఆర్. ఎలూజై, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్

సహాయ సంపాదకులు:
బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్


### చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశంలో |
|---|---|---|
| 1 సంవత్సరం | రూ. 150 | $20 |
| జీవిత సభ్యత్వం | రూ. 2000 | $200 |
| పోషక సభ్యత్వం | రూ. 150 (ప్రతినెల) | $20 |

**ప్రత్యేక మనవి**

అందరికీ అందుబాటులో ఉండాలని సం. చందా రు.150 గానే ఉంచాము. వాస్తవానికి సుమారుగా రు.200/- ఖర్చవుతుంది. పరిచర్య అభివృద్ధి కోసం ప్రార్థించి, ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే మీ సేవా కానుకలు పంపాలని మనవి. కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన (SPANDANA) పేరు మీద మా అడ్రస్‌కు పంపాలి. మీ కానుక అందిన వెంటనే స్పందన ఆఫీసు నుండి ఉత్తరం రాస్తాము.

అకౌంట్ పేరు "స్పందన"
ఆన్‌లైన్ అకౌంట్ నం. 015810100016691
ఆంధ్రాబాంక్, గుణదల, విజయవాడ.


మా అడ్రస్
**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్, గుణదల,
విజయవాడ - 520 004, ఫోన్ : 2456547,

E-mail: spandana1976@gmail.com



Founder & Chief Editor
ACHARYA R.R.K.MURTHY

Printed, Published and owned by
DEVASAHAYAM DANDALA
Printed at Spandana Offset Printers, Suryaraopet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada - 2.

# స్పందన ప్రతిస్పందన

## ఎంతో ఆనందం

స్పందన బృందం వారికి నా హృదయపూర్వకమైన వందనాలు. స్పందన మాసపత్రిక నా ఆత్మకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. మీ పత్రిక ద్వారా చాలా విషయాలు అర్థమగుచున్నవి.

**జె. సరోజిని, రాజమండ్రి.**

## ఆత్మలు రక్షింపబడాలి

ప్రభువునందు ప్రియులైన ఆరార్కే మూర్తి గారికి, దైవసేవకులు డా॥దేవసహాయం గారికి యేసుక్రీస్తు శక్తివంతమైన నామమున వందనములు. స్పందన మాసపత్రిక ఎంతో ఉపయోగకరంగా ఉన్నదని మీకు తెలియజేయడానికి ఎంతో సంతోషిస్తున్నాము. పత్రికలో వస్తున్న ఆర్టికల్స్ అన్ని మేము విడచిపెట్టకుండి చదువుచున్నాము. మేము మీ యొక్క పరిచర్య గురించి ప్రతిరోజు మా కుటుంబ ప్రార్థనలో ప్రార్థిస్తున్నాము. ఇంకా అనేకమైన ఆత్మలు మీ పరిచర్య ద్వారా రక్షణ పొందాలని ప్రార్థిస్తున్నాము.

**యం. స్టెల్లా షారోన్.**

## దైవవాక్యములు

ప్రభువునందు ప్రియులైన స్పందన ఎడిటర్ గారికి వందనములు. అయ్యా మీరు టీ.వి లో ప్రసారం చేయుచున్న "స్పందన" కార్యక్రమం వలన మేము ఎంతగానో బలపడుచున్నాము. మేము ఇంకా నిజమైన దేవునిగూర్చి తెలుసుకొనవడానికి మీ పత్రిక కూడా చదవాలని ఆశపడుతున్నాం.

**యం. డేవిడ్‌రాజు, భీమవరం.**

## మంచి ఆలోచన

గౌరవనీయులైన సంపాదకులకు "స్పందన" మాసపత్రిక మాకెంతో ఉపయోగకరముగా ఉన్నది. ఎన్నో తెలియని విషయాలు తెలుసుకొంటున్నాము. బైబిల్ పాఠాలు ఎంతో వివరంగా తెలియజేయుచున్నారు. కృతజ్ఞతలు.

**కె. యస్. జాషువ, చత్తిస్‌ఘడ్.**






## ఆధ్యాత్మిక ఎదుగుదల

దేవసహాయం అయ్య గారికి వందనాలు. అయ్యా మీరు ఆరాధన చానల్‌లో చెప్పిన వాక్యము వింటున్నాము. మా యొక్క ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుచున్నాయి. 20 సం॥ల నుండి పత్రిక చదువుతున్నాము.

**యస్. మెర్సిబాయమ్మ, భద్రాచలం.**

## చక్కని వర్తమానం

యేసుక్రీస్తు నామములో బ్రదర్. దేవ సహాయంగారికి వందనములు. గతవారం మీరు ఆరాదన చానెల్ ద్వారా సువార్త ప్రకటించడం నేను చూచాను. చాల చక్కని వర్తమానంను అందించినారు. మీరు చేస్తున్న సేవా సమాచారంను, ఆత్మీయ పాఠములను పత్రిక ద్వారా దేవుని పిల్లలకు పంచుతున్నారు. దేవుడు మీ పరిచర్యను దీవించి అభివృద్ధి పరచును గాక!

**యమ్. ఆశీర్వాదం, కోవెలకుంట్ల.**

## ఆనందకరంగా..

క్రీస్తునందు ప్రియులైన దేవసహాయం గారికి, ఆరార్కే అయ్యగారికి వందనాలు. మీరు పంపుచున్న స్పందన పత్రిక ద్వారా మేము బలపడుతున్నాము. అందులోని వాక్యాలు మాకు ఆనందకరంగా వున్నాయి.

**జి. వెంకటమ్మ, నంద్యాల.**

## బలపడుచున్నాము

గౌరవనీయులు దైవసేవకులకు వందనాలు. ఆరాదన టీ.వి ద్వారా మీరు అందిస్తున్న సందేశాలు విని ఆధ్యాత్మికంగా బలపడుచున్నాము. మీ ఆరోగ్యం కొరకు ప్రార్థిస్తున్నాము.

**యమ్. సశీలమ్మ, హిందూపూర్.**

## ఆనందకరంగా..

బ్ర. దేవ గారికి అయ్యా! దాదాపు గత పది సంవత్సరాలనుండి "స్పందన" పత్రిక చదువుచూ, టీ.వీ లో ఆరార్కేగారి, మీ ప్రసంగాలను చూస్తూనే ఉన్నాను. మీ పత్రిక నాకు చాలా అవసరమైనది. అది చదివితే గాని నాకు నిద్రపట్టదు.

**యస్. సొలోమోను రాజు, మహబూబాబాద్.**

## సంపాదకీయం....

# మంచి బాస్

**ప్రార్ధన** అంటే తీవ్రమైన ఉత్కంఠ. నీకు దాహం కాదు. ప్రార్ధనలో విశ్వాసికి దప్పి ఉండదు. ఆకలి ఉండదు. ఎవ్వరికీ తెలియని ఆహారం ప్రభువు తినిపిస్తాడు. పరాభక్తి అనగా పారలౌకికమైన భక్తి. దేవుని సాత్వికం దేవునితో ఏకత్వం. దేవుని పూర్ణత్వం–ఔన్నత్యం–ఆధ్యాత్మిక భావసిద్ధి – తృప్తి ప్రార్ధనలో మాటలే కాదు. మాటల వెనుక ఉన్న మౌనం! దావీదు తన కీర్తనలో గానం చేసాడు. ***"దేవా రాత్రివేళ నన్ను దర్శించి నన్ను పరిశోధించావు. నీకు నాలో ఏ దురాలోచన కానరాలేదు. నా నోటి మాటచేత నేను అతిక్రమించను."*** మన సమస్యలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. మనకు జీవించడానికి బోలెడంత ఉంది. కానీ దేనికోసం, ఎవరికోసం జీవించాలో తెలియదు. ఆధ్యాత్మిక విలువలు లేని వాటికోసం కొందరు తమ జీవితమంతా వ్యయం చేస్తారు. యేసు మనకు దేవుడిచ్చిన మాదిరి. అతి సామాన్య జీవితం జీవిస్తూ అసాధారణ కార్యాలు చేసే విశ్వాస వీరులకు ఆయన గొప్ప మాదిరి. అతి సామాన్య జీవితం జీవిస్తూ అసాధారణ కార్యాలు చేసే విశ్వాస వీరులకు ఆయన గొప్ప మాదిరి. మనకు విశ్వసనీయత ముఖ్యం. విజయం దానంతట అదే వస్తుంది. 1 కొరింథీ 4:2లో మనమంతా గృహనిర్వాహకులమని, మన విశ్వసనీయత దేవుడు గుర్తిస్తాడని చెప్పబడింది. యేసుప్రభువు తన శిష్యుల పాదాలు కడిగినప్పుడు నాయకులలోని అధికారమునకు అది గొప్ప తీర్పు. మనకు ఆలోచనలు అనేక దిక్కుల నుండి వస్తాయి. మంచి ఆలోచనలు ప్రభువు నుండి వస్తాయి. ఆలోచన అనేది ముడిసరుకు. దాన్ని క్రియారూపానికి మార్చాలి. అవతల వ్యక్తి వినాలని నీవు ఆశించినప్పుడు అతడే ఊరికే మాట్లాడుతుంటే నీకు బోరనిపిస్తున్నది. వినమని దేవుడు అంటూ ఉంటే అది వినకుండా నీవే మాట్లాడటం దేవుణ్ణి అవమానపరిచినట్లే. డాక్టారుకు నీవు చెప్పేదంతా త్వరగా చెప్పి ముగించు. ఆ తర్వాత డాక్టరును మాట్లాడనివ్వు. వినటం చేతనే విశ్వాసం కలుగుతున్నది. వినటం అంటే విధేయత చూపటం అని అర్ధం. విన్నది చెయ్యకపోతే వినటం ఎందుకు? మాట వినటం వెయ్యి అర్పణల పెట్టు. పరిశుద్ధాత్మ సంఘాలతో, వ్యక్తులతో చెప్పే మాట చెవిగలవాడు వింటాడు. ఆధ్యాత్మిక బధిరత్వం నాశనానికి దారి తీస్తుంది. నీ మనస్సాక్షి నీ బాస్. నీ మనస్సాక్షి పరిశుద్ధాత్మ చేత ప్రభావితమై ఉంటే అది మంచి బాస్. నీ బాస్ చెప్పినట్లు చెయ్యడం నీకు శ్రేయస్కరం.

క్రీస్తునందు భవదీయుడు – ఆరార్కే

# మనలో మాట....

మా ప్రియ పాఠకులకు

యేసు క్రీస్తు ప్రభువు దివ్య నామమున అక్టోబరు నెల శుభాకాంక్షలు.

బైబిలు గ్రంథంలో సుమారుగా 365 సార్లుకంటే ఎక్కువగా **భయపడకుము, జడియకుము, దిగులు పడకుము** అనే మాటలున్నాయని బైబిలు పండితులు చెబుతూ ఉంటారు, అంటే ప్రతి రోజూ దేవుని వాగ్దానాన్ని మనం ఆశ్రయించటం అవసరం. ఈ రోజుల్లో ఉదయాన్నే వార్తా పత్రిక చూచినా, టివిలో వార్తలు వీక్షించినా ఎంతో భయాన్ని కలిగించే విషయాలు. పొలాల్లోనికి నీరు పంప్ చేసినట్టు, సైతాను మనుష్యుల హృదయాల్లోనికి భయాన్ని ప్రవేశపెడుతున్నాడు.

ఓ వారం రోజుల క్రితం టివిలో చూస్తున్నాను. ఓ ప్రత్యేకమైన వార్తేమంటే ఆకాశంలో ఉన్న సాటిలైట్‌లో సమస్య వచ్చింది, త్వరలో సెల్ ఫోన్లు ఇక పనిచేయవు, విమాన ప్రయాణాల్లో కూడా చాలా ప్రమాదాలు జరుగుతాయి.

ఈ రోజున అనేకమంది పిల్లలు ఇతర దేశాల్లో ఉన్నారు. వృద్ధులయిన తల్లిదండ్రులు ఇక్కడున్నారు, వారే ఈ వార్త చూచి అయ్యో ఇక మా పిల్లలను చూచుకోలేమా, కేవలం ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా? అనే ఆలోచన వచ్చిందనుకోండి వారి పరిస్థితేంటి, చెప్పండి.

అలాగే ఏక్సిడెంట్ వార్తలు. రోడ్ ప్రయాణం చేయాలంటే ఎంత భయమేస్తుందో. మరీ ఘోరమైన విషయమేమంటే ఆ రక్తపు మడుగులను కూడా అలాగే వార్తా పత్రికలలో ప్రింట్ చేస్తున్నారు. అవి చూచి కొన్ని సార్లు హృదయం విదాకరం అవుతోంది.

సైతాను మనుష్యులను భయానికి గురిచేయాలి. అప్పుడు వాడి ఉద్దేశ్యం నెరవేరుతుంది.

గమనించాల్సిన విషయం ఏమంటే విశ్వాసులు సహితం సైతాను తంత్రాలను గుర్తించక చాలా సార్లు సమస్యల్ను కొనితెచ్చుకుంటున్నారు.

ఒక్క విషయాన్ని బాగా గుర్తుంచుకుందాం! దేవుని కార్యాలు మన జీవితంలో జరగాలంటే మనకుండాల్సిందేమిటి? **'విశ్వాసం'** కదా?! మన ప్రభువు కూడా అనేక అద్భుతాలు చేసినపుడు ఆయన పదే, పదే చెప్పిన మాట **'నీ విశ్వాసము నిన్ను బాగుచేసింది'**. విశ్వాసమును బట్టి మనం రక్షింప బడుతున్నాం! రోమా 10.9.

అదే విధానంలో వ్యతిరేఖ విషయాలు భయం మూలకంగా కలుగుతాయి. అంటే విశ్వాసానికి ఎంత ప్రభావం వుందో భయానికి కూడా అంత ప్రభావం ఉందని గుర్తుంచుకోవాలి. సైతానుకు కొంచెం సందిస్తే పూర్తిగా ఆక్రమించేస్తాడు.

విశ్వాసులు భయపడకూడని 7 విషయాలు మీ దృష్టికి తెస్తాను.

**1) జీవితయాత్రలో భయపడకు. ఆదికాం. 26.24**

**2) కరువులో భయపడకు. 1 రాజులు 17.13**

**3) ఆపదలో భయపడకు. 2 రాజులు 6.16**

**4) బలహీనతలో భయపడకు. యెషయ 41.10**

**5) శోధనలో భయపడకు. యెషయా 43.1-3**

**6) నీ ప్రతిచిన్న విషయం నీ దేవునికి తెలుసు. కనుక భయపడకు. మత్తయి. 10. 31, 32**

**7) మరణం తరువాత మహిమ ఉంది. కనుక భయపడకు. ప్రక 1.17, 18**

**'నేను నీకు తోడైయున్నాను గనుక భయపడకుము'.** ఆదికాం. 26.24లో అబ్రాహాము కుమారుడైన ఇస్సాకు ప్రభువిచ్చిన వాగ్దానం మనకు కూడా వరిస్తుంది. వ.3లో **'ఈ దేశమందు పరవాసివై వుండు'** అన్నాడు దేవుడు. **'ప్రియులారా, మీరు పరదేశులును యాత్రికులునైయున్నారు'** *1* పేతురు *2.11* సెలవిస్తోంది. విశ్వాస వీరులు ఈ లోకంలో పరదేశులమని, యాత్రికులమని ఒప్పుకున్నారు. అంత మాత్రమే కాదు, అది వాగ్దత్త దేశమైనా అన్యులదేశంలో ఉన్నామన్నట్లు జీవించారు. హెబ్రీ *11.13.* **'పరదేశులమో ప్రియులారా'** అనే ఆంధ్ర క్రైస్తవ కీర్తన కాని, 'పరవాసిని నే జగమున

ప్రభువా' అనే సీయోను కీర్తన గాని ఈ రోజున 'చావు పాటలుగా' ప్రాచుర్యం పొందాయి గాని అవి యాత్రా కీర్తనలు. ప్రతి రోజూ మనం గుర్తుం చేసుకోవాల్సిన ఎన్నో ప్రాముఖ్యమైన విషయాలు ఆ పాటల్లో ఉన్నాయి.

ఈ రోజును దేవుని బిడ్డలు, సంఘాల్లో ఉన్న అనేక సమస్యలకు కారణం ఈ లోకంలో మనం యాత్రికులమని, పరదేశులమని మరచిపోవటం. ఈ లోకం, ఈ లోక విషయాలు శాశ్వతమనుకుని, ధనము, అధికారము శాశ్వత మన్నట్టు జీవిస్తున్నాము గనుకనే అనేక ఘోరవిషయాలు చూస్తున్నాం.

ఈ రోజుల్లో అనేక సంఘాలు, విశ్వాసుల కుటుంబాలు కూడా ఈ సమస్య బారిన పడుతున్నారు.

కొన్ని కొని తెచ్చుకున్న సమస్యలు. మరి కొన్ని మన శత్రువు, సైతాను ఎక్కడ సందు దొరుకుతుందా అని కాచుకుని ఉన్నాడు. భక్తిగా ఉండే వారి మీద సహితం వాడు దాడి చేయ ప్రయత్నిస్తూనే ఉంటాడు. అయితే అంతిమ విజయం మన ప్రభువుకు, ఆయన బిడ్డలమయిన మనకూ స్వంతం!

దేవుని వాక్యానికి అనుగుణంగా మనం జీవించాలి. ద్వితియోప దేశకాండ 28 అధ్యాయంలోని మొదటి 16 వచనాల్లో అనేక ఆశీర్వాదాలు చదువుతాము. ఇవన్నీ మనకు ఎప్పుడు ప్రాప్తిస్తాయి. **'నీవు నీ దేవుడైన యెహోవా మాట శ్రద్ధగా విని నేడు నేను నీకు ఆజ్ఞాపించుచున్న ఆయన ఆజ్ఞల నన్నిటిని అనుసరించి నడుచుకొనిన యెడల....'** చాలా సార్లు ఈ వాగ్దానాలను మాత్రమే చదువుకొని సంతోషపడి దేవుని వాక్యం ఇచ్చే హెచ్చరికలను మనం మరచి పోకూడదు.

1 రాజులు 17.13లో సారెపతు విధవరాలితో దైవజనుడు చెప్పిన మాట **'భయపడకు'.** దేవుడు మరలా వర్షం ఇచ్చే వరకు నీ ఇంట్లో ఉన్న ఆ కొంచెం పిండి, కొంచెం నూనె అయిపోదు. దేవునికి స్తోత్రాలు! ఈ లేఖన భాగాలు మీరు జాగ్రత్తగా గమనిస్తే వ.4లో **'నేను కాకోలములకు ఆజ్ఞాపించాను'.** వ.9లో **'నిన్ను పోషించటానికి అక్కడ ఉన్న ఓ విధవరాలికి నేను సెలవిచ్చితిని'.** **ఆజ్ఞాపించాను, సెలవిచ్చాను** అనే రెండు మాటలు – జరిగిపోయిన కాలాన్ని సూచిస్తున్నాయి. అర్ధం చేసుకోవాల్సిన విషయమేమంటే నీకు భవిష్యత్తులో కూడా ఏం కావాలో దేవుడు ముందుగానే సిద్ధం చేసి ఉంచాడని మరువకూడదు.

ఆ తరువాత మరో సంఘటన కూడా గుర్తు చేసుకుందాము. 2 రాజులు 6.16. దైవజనుడు ఎలీషా గొప్ప ఆపదలో ఉన్నట్టు పనివాడు చూశాడు, గజగజ వణికిపోతున్నాడు. దైవజనుడు చెప్పిన మాట గమనించండి. **'భయపడవద్దు, మన పక్షాన ఉన్నవారు వారికంటే అధికులు.'**

అంటే సేవలో తర్ఫీదులో ఉన్న ఈ యువకుడు దైవజనుని వలె విశ్వాస నేత్రాలతో చూడలేకపోతున్నాడు. చాలా సార్లు మన జీవితాల్లో కూడా ఇదే జరుగుతుంది. దేవుని ఆశ్చర్య అద్భుతకార్యాలను అనుభవించని 'నామకార్ధ' విశ్వాసుల మధ్యన మనం ఉంటే ప్రతి చిన్న దానికి వాళ్లు భయపడతారు, మనల్నూ భయపెడ్డటానికి ప్రయత్నిస్తారు. దేవుని రక్షణ, స్వస్థత, అద్భుతాను అనుభవించే ప్రజల సహవాసంలో నీవుంటే నీకేదైనా కష్టం, సమస్య ప్రాప్తించి నపుడు వారి జీవితాల్లో అలాంటి సమస్యలకు పరిష్కారాన్ని ప్రభువులో వారు అనుభవించినవారు గనుక నీకూ ధైర్యం చెబుతారు, విశ్వాసంతో ప్రభువు మీద ఆధారపడేట్లు సాయ పడతారు

అందుకే మన ప్రభువు చెప్పిన మాట మత్తయి 10.30లో నీ తల వెంట్రుకలు కూడా లెక్కింపబడివున్నాయి. ఆయన మిమ్మును గూర్తి చింతించుచున్నాడు (జాగ్రత్త కలిగియున్నాడు) గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయండి. 1పేతురు 5.7 దేవుడు మిమ్మును సమృద్ధిగా దీవించి ఆశీర్వదించును గాక!

**క్రీస్తునందు సోదరుడు**

**దేవసహాయం దండల**

ఈ మాసపు ప్రసంగం



- ఆచార్య ఆరార్కే

# సబ్బాతు వాగ్దానం




**దేవుని** బిడ్డలకు సబ్బాతు విశ్రాంతి నిలిచి ఉంది. సబ్బాతు వాగ్దానం మోషేకాలం నాటిది. దావీదు కాలం నాటిది. సబ్బాతు విశ్రాంతి అనే భావనకు కాలదోషం పట్టదు. దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులను ఈజిప్టు దాస్యం నుండి బయటికి నడిపించాడు. వారిని నడిపించడానికి దేవుడు మోషే, అహరోనులను వాడుకున్నాడు. దేవుడు మోషేను పిలిచింది మొదలు ఎన్నో అద్భుతాలు చేసి ఇశ్రాయేలీయులను ఈజిప్టు చెర నుండి బయటకు రప్పించాడు. వారు సీనాయి వరకు వచ్చారు. అక్కడ ఇశ్రాయేలీయులకు దేవుని తీర్పు, ధర్మశాస్త్రము, ఆధ్యాత్మిక మతవిధులు అనుగ్రహించబడ్డాయి.

## ఇశ్రాయేలీయుల సబ్బాతు

నిర్గమ కాలానికి రెండేండ్ల తరువాత వారు కాదేషు బర్నియాలో విడిదిచేశారు. అమోరీయుల కొండను దాటారు. వీరిముందు వాగ్దత్త భూమి కనబడుతోంది. దేవుడు వారిని వెళ్ళమన్నాడు. దాన్ని స్వాధీనం చేసుకోండి అని ఇశ్రాయేలీయులను ఆదేశించాడు. కాని వారు అవిశ్వాసము చేత అందులో ప్రవేశించలేకపోయారు. దేవుని వాగ్ధానంకంటే వేగులవారు తెచ్చిన నివేదిక వారికి వాస్తవమనిపించింది. వారు దేవుని ఆజ్ఞను ధిక్కరించారు. తమ నాయకులకే ఎదురు తిరిగారు. వీరి అవిశ్వాసానికి, అవిధేయతకు శిక్ష ఏమిటో తెలుసా? దేవుడు ఇశ్రాయేలీయులకు వాగ్ధానం చేసిన వాగ్ధత్త భూమిలోనికి ఈ అవిధేయులు, అవిశ్వాసులు ప్రవేశాన్ని కోల్పోయారు. కాలేబు, యెహోషువా తప్ప మరెవ్వరూ వాగ్ధత భూమిలో అడుగుపెట్టలేక పోయారు. ఆ తరువాత తరం మాత్రమే వాగ్ధత్త భూమి అయిన కనానులోకి ప్రవేశించగలిగింది. యొర్ధాను దాటారు అంటే మరణాన్ని గెలిచారు. తరించారు అని అర్థం. అది **"సబ్బాతు విశ్రాంతి"**. సామూహిక సామాజిక అనుభూతి!

## క్రీస్తునందు సబ్బాతు

అయితే మన సబ్బాతు విశ్రాంతి యేసు రెండోరాకడలో సిద్ధిస్తుంది. 2 పేతురు 1:16 యేసు శక్తి, ఆయన రాకడ ఊహ, అపోహలు కావు. కన్నులారా చూచి ఆయన మహాత్మ్యమును మనకు చెప్పారు, రాశారు. క్రీస్తునందు పరోక్షంగా సబ్బాతు విశ్రాంతిని మనమిప్పుడు అనుభవిస్తానే ఉన్నాము. సంస్కారాదుల వల్ల గృహశుద్ధి అయింది కాని ఖాళీ ఇంటిలోకి దయ్యాలు వస్తున్నాయి. హెబ్రీ 10:22 ధ్యానించండి. యథార్థ హృదయంతో దేవుని సన్నిధికి చేరాలి. విశ్వాస విషయంలో సంపూర్ణ నిశ్చయత కలిగి యథార్థ హృదయముతో ఆయన సన్నిధానములో ప్రవేశిద్దాము.

## క్రైస్తవ నిరీక్షణ

యేసురాకడ దినం సమీపిస్తుంది. ఇకకాలము బహు కొంచెంగా ఉన్నది. వచ్చేవాడు ఆలస్యం చెయ్యకుండా వస్తాడు. మనం వెలుగు బిడ్డలం. ఆయనరోజు మనకు ఆనందదినం సబ్బాతు విశ్రాంతి దినం. రోమా 13:11 మనము కాలమెరిగి ఇది మెళుకువగా ఉండాల్సిన వేళ అని తెలుసుకొని ప్రవర్తించాలి. మనకు రక్షణ అయిన యేసు రాకడ బహు సమీపంగా ఉంది. రాత్రి చాలా గడిచిపోయింది. పగలు సమీపిస్తుంది. అంధకార క్రియలను విసర్జించాలి. తేజస్సంబంధమైన యుద్ధోపకరణాలు దరించుకుందాము. యేసురాకడ దినం మనకందరికి శుభప్రద నిరీక్షణ. యేసురాకడ దినం ఆయననెరుగని వారికి ఉగ్రతదినం. పాతనిబంధనలో నిక్షిప్తమై ఉన్న క్రీస్తు నిరీక్షణ సంఘ యుగంలో క్రైస్తవ నిరీక్షణ అయింది. క్రొత్త భూమి కోసం, క్రొత్త ఆకాశం కోసం నిరీక్షిస్తున్నాము. ఇది నిత్యత్వానికి చెందిన ఆశాభావం.

## ప్రభూ త్వరగా రా!

యేసురాజ్యం వర్థిల్లాలి, త్వరగా రావాలి. ఆయన చిత్తం సర్వేసర్వత్ర నెరవేరాలి. ఆయన వస్తేనే గాని అన్నిటికి కుదురుబాటు ఉండదు. ఇది విశ్వాసులందరి ఆకాంక్ష సమస్తమూ పునఃస్థాపితమవుతుంది. అన్ని అవాంచనీయ పరిస్థితులూ గతిస్తాయి. మోషే నుండి మలాకీ వరకు ప్రవచనాలన్నీ తూ చా తప్పకుండా నెరవేరాలి. యూదుల సార్వత్రిక జాతీయ పశ్చాత్తాపదినం



రావాలి, వస్తుంది. అపొ.కా 3:19,21 **"ప్రభువు సముఖమునుండి విశ్రాంతి కాలాలు వస్తాయి. యూదులందరూ మారుమనస్సు నొంది తిరుగతారు".**


మోషే, దావీదు కాలంలో యూదులు తమ అవిశ్వాసం చేత ఆయన విశ్రాంతిలో ప్రవేశించలేకపోయారు. వారి అవిశ్వాసానికి ఫలితంగా యెరూషలేము మీదకు శిక్ష వచ్చింది. "ప్రభూ త్వరగా రా!" అని ఆయనకు సార్వత్రిక ఆహ్వానం! రోమా పత్రికను అపొస్తలుల కార్యములు వెలుగులో చదివితేనే గాని అర్థంకాదు. ప్రకటన 22:20,21 యెహోవా భక్తులు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ ఉంటే వింటాడు. ఆయన నామమును స్మరించేవారికి జ్ఞాపకార్థంగా ఒక గ్రంథం ఆయన సమక్షంలో రాయబడింది.

లవొదికయ సంఘ లక్షణాలు ఆధునిక సంఘంలో కానరావటం ఎంతైనా శోచనీయం. ప్రకటన 3:17 తన నిజస్థితిని తనే గుర్తించలేకపోతుంది. హెబ్రీ పత్రిక సారాంశమిదే – క్రీస్తు శ్రమలు ఆ తరువాత ఆయన మహిమలు! దేవుడి క్యాలెండరులో ప్రతి ఒక్క సంఘటన ఆయన రెండవరాకడలో నెరవేరటం మనం చూస్తాము. అది విమోచన పంట, పండుగ. యేసు సంఘయుగం ముగింపులోకాని ఈ నెరవేర్పును మనం చూడలేము. ప్రకటన 7:9-12 పస్కా పండుగ తర్వాత పెంతెకోస్తు పండుగ! ఇశ్రాయేలు, యూదా పునః స్థాపన పెంతెకోస్తు తరువాత ప్రథమ ఫలాలు పండుగ, చిట్టచివరికి పర్ణశాలల పండుగ! అది అంతర్జాతీయ మేళా! ఆమేన్!



– డా॥ దేవ దండల

# బైబిలు యువకులు



బైబిలులు యువకులందరిలో శ్రేష్టమైన జీవితం యోసేపు జీవించాడు యువకుని జీవితం నేడు మనకు నేర్పే పాఠాలు ఎన్నో ఉన్నాయి. నేర్చుకుందాం.

## రంగురంగుల అంగీ

యోసేపు కాలంలో ప్రతి ఒక్కరూ ఓ అంగీ(పై వస్త్రాన్ని) కలిగియుండేవారు. ఈ వస్త్రం చలికి కప్పుకోటానికి, ప్రయాణానికి కావలిసిన సామాను కట్టుకోవటానికి, చిన్నపిల్లలను కప్పటానికి, కూర్చోటానికి, కొన్నిసార్లు అప్పుతీసుకోటానికి హామీగా కూడా ఉపయోగిస్తారు. ఈ వస్త్రం సాదారణంగా ఉండి మోకాళ్ళ వరకూ వచ్చేంత పొడవుండి, చొక్కా అంత వెడల్పు ఉంటుంది. అయితే యోసేపు అంగీలో చాలా వ్యత్యాసం ఉంది. రాజవంశస్తులు ధరించే లాంటిదీ అంగీ. సన్నగా పొడవుగా ఉండి, పాదాలవరకు ఉండి, రంగు రంగులుగా ఉంది.

యోసేపు యెడల యాకోబు చూపిన ప్రత్యేక అభిమానాన్ని ఈ అంగీ తెలుపుతుంది. యాకోబు యోసేపును ప్రేమించటం మిగతావారికి యిష్టంలేదు. ప్రత్యేకించి ఈ రంగురంగుల అంగీ విషయం మిగతా సహోదరులకు మింగుడు పడకుండా ఉంది. అసలే అంతంత మాత్రమున్న ఈ సహోదరుల సంబంధాలు ఈ అంగీతో పరాకాష్టకు చేరుకున్నాయి.

## యోసేపు-కలలు

అప్పటికే తమమీద అధికారం చేసే యత్నమని యోసేపు మీద మిగతా సహోదరులు మండిపడుతున్నారు. అగ్నికి ఆజ్యం తోడైనట్లుయింది, యోసేపు కన్న కలలు వారికి చెప్పటం. యోసేపు యిక్కడ కొంత డాంబికాన్ని ప్రదర్శించదేమో! మనం సాదించిన విజయాలను ఇతరులకు చెప్పేటప్పుడు దేవునికి మహిమ వచ్చేలా ఆయా విషయాలు వివరించాలి. యువకుడైన యోసేపు ఈ పాఠాన్ని చాలా కష్ట మార్గంలో నేర్చుకున్నాడు. అసూయపరులైన తన సహోదరులు అతణ్ణి వదిలించుకోవడానికి బానిసగా అమ్మివేశారు. ఆది 41:16లో తన విజయం యొక్క ఆధికత్యను దేవునికే ఆపాదించాడు యోసేపు.

## అసూయ - ద్వేషం

ఎవరి గురించైన నీకు అసూయ-ద్వేషం ఉంటే అతణ్ణి నీవు హతమార్చాలనే వాంఛ నీలో ఉంటుంది కదూ! "లేకపోవచ్చు" అని నీవు సమాధానమిచ్చే ముందు యోసేపు విషయంలో ఏం జరిగిందో గమనించండి! ఓ రంగురంగుల అంగీ విషయమై పదిమంది సహోదరులు ఏకమై తమ సహోదరుణ్ణి చంపాలని నిర్ణయించారు. మంచిని గురించి

ఆలోచించే విషయంలో పూర్తిగా గ్రుడ్డివారైపోయే స్థాయికి తెచ్చింది వారి హృదయాల్లో దాగివున్న అసూయ-ద్వేషం.

మనలో ఉన్న అసూయను పసికట్టడం కష్టతరం! కారణం అందుకు మనం ఆలోచించే విధానం సరైందని అనుకోవటం! వ్యక్తిగత పరీక్ష ఎంతో అవసరం! నిర్లక్ష్యంతో మనలో దాగిన అసూయ ఆలోచనలు కొనసాగించినంతకాలం, వాటిని సరిచేసుకోవటం కష్టసాధ్యమవుతుంది.

## హెచ్చరిక

ఈ ప్రత్యేక కేంద్ర బిందువు విశ్వాస జీవితంలో చాలా ప్రాముఖ్యమైంది. కనుక ప్రతి ఒక్కరూ క్షమా హృదయులై ఇతరులను ప్రత్యేకించి మనకు కీడు చేసినవారిని క్షమించ బద్ధులమైయున్నాము.

## హత్య-ప్రత్యామ్నాయం

సరే! యోసేపు సహోదరుల ఆలోచనల్లోనికి హత్యా నేరం ఘోరమనే భావన వచ్చింది. యూదా ఒక ప్రత్యామ్నాయ ఆలోచన చెప్పాడు. అది హత్యనేరం నుండి వారిని తప్పిస్తుంది.

గమనించాలి! కొన్ని సార్లు "చిన్న పొరపాటే" కదా అని చేయ సాహసిస్తాము. అయినా అది సరైన విషయం కానపుడు చేయకూడదు. మనుష్యులు చేయటానికి వీలయ్యే పరిష్కారం ఏదో చూపినపుడు "ఇది మంచిదేనా?" అని పరీక్షించుకోవాలి.

యోసేపు సహోదరులు అతణ్ణి వాస్తవంగా చంపకపోయినా, తమ జీవితాల్లో నుండి (అతణ్ణి తొలగించడం) బానిసగా అమ్మినపుడు చనిపోయిన వానితో సమానంగా వారికి తోచింది. దాదాపు 30 దినాల దీర్ఘ ప్రయాణానంతరం యోసేపును ఈజిప్టుకు, కాళ్ళు చేతులకు సంకెళ్ళతో, ఓ వస్తువును కొనిపోయినట్లు కొనిపోయి ఐగుప్తులో అమ్మివేశారు.

## మోసపోయిన మోసగాడు

తమ దుష్క్రియను కప్పి పుచ్చుకోవటం కోసం, యాకోబు కుమారులు యాకోబును మోసగించి, యోసేపును ఏదో క్రూరమృగం చంపేసిందని మోసపుమాటలు చెప్పారు. గమనించాలి! యాకోబు ఇతరులను అనేకసార్లు మోసగించాడు (చివరకు తన తండ్రిని కూడా) అయితే తనే ఇప్పుడు మోసపోతున్నాడు. "మోసపోకుడి, దేవుడు వెక్కిరింప బడడు, మనుష్యుడు ఏ పంట విత్తుతాడో అదే పంట కోస్తాడు." యాకోబు చేసిన మోసపూరితమైన పాపాలకు దేవుడతణ్ణి వెంటనే శిక్షించలేదు. కాని తన పాపపు ఫలితాలు తన జీవితాంతం వెంటాడుతూనే వచ్చాయి.

## శోధన

పోతీఫరు భార్య శోధనను యోసేపు జయించిన విధానం గమనార్హం. "ఈ దుష్కార్యాన్ని చేసి దేవునికి విరోధంగా ఎలా పాపం చేయగలను?"

"నీకు అన్యాయం చేయలేను" "పోతిఫరుకు నమ్మక ద్రోహిని కాలేను" "నేనీ పాపం చేయను" అనలేదు. ఒకవేళ బలవంతం చేయబడితే ఈ సాకులన్నీ ఎగిరిపోతాయి. కాని యోసేపు తీర్మానం "దేవునికి విరోధంగా పాపం చేయకూడదు" అలాంటి నిర్ణయం, తీర్మానం అత్యంత అవసరం, శ్రేష్టం. గుర్తుంచుకోండి! వ్యభిచారమనే పాపం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే పాపమే కాకుండా, అది దేవునికి అవిధేయుల మయ్యే ఘోరపాపం, కార్యం. యోసేపు పోతిఫరు భార్య ఆశలన్నిటిని త్రోసిపుచ్చాడు. చివరకు ఆమె వద్ద నుండి పరుగెత్తిపోయాడు. కొన్నిసార్లు శోధనను తప్పించుకోవటం కేవలం సరి పోదు. ఆ పరిస్థితి నుండి పారిపోవాలి.

## చెరసాల-విడుదల

దాదాపు రెండు సంవత్సరాలు చెరసాలలో ఉన్నాడు. యోసేపు. ఆ తర్వాత కలల భావాన్ని తెలుపటానికి ఫరో యొద్దకు తేబడ్డాడు. తనూహించిన విధంగా తనకు సహాయం రాలేదుగాని, దేవుని సహాయం మరో విధంగా వచ్చింది. తీర్పు కోసం రాజు ఎదుట నిలువబడలేదు, గాని రాజుకు సలహాలనివ్వటం కోసం రాజు దగ్గర నిలువబడ్డాడు. తన అన్నలందరూ తనకు నమస్కారం చేయనే చేసారు. అన్నలు అమ్మినవాడే ఐగుప్తుకు అధికారి అయ్యాడు. అధికారం చేతిలో ఉన్నా అన్నలమీద గాని పోతిఫరు భార్యమీద గాని పగతీర్చుకోవాలనుకోలేదు. అదంతా దేవుని ఏర్పాటు అన్నాడు. పగ తీర్చుట దేవుని పని. యోసేపు జీవితమంతా దేవునితో అంటే దేవునికి లోబడుటతోనే నడిచింది. ఆమేన్!



ఆర్. ఏలూజై

# ప్రశంసా పత్రం



'ప్రభువు సీమోను ఇంట భోజనానికి వచ్చాడంట. తొందరగా వెళ్ళి ఆయన్ను చూసి రావాలి. కానీ ప్రభువుకేం తీసుకెళ్ళాలి? వంటకాలేమైనా తీసుకెళదామంటే, ఆయనే అందరికీ ఆహారం పెట్టేవాడాయే. అయినా ఆ ఇంట్లో భోజనానికొస్తే, ఈ ఇంట్లోనుండి తీసుకెళ్ళడం ఏంబావుంటుంది! పైగా ఆ సీమోను పరిసయ్యుడు. ఎప్పుడు చూసినా ఆచారవ్యవహారాలంటాడు. ఇక్కణ్ణుంచి ఏమైనా తీసుకువెళితే ఊరుకుంటాడా! పోనీ తాగాడానికేమైనా తీసుకెళదామా అంటే నీటినే ద్రాక్షారసంగా మార్చేసిన వానికి, ఏ పానీయం నచ్చుతుందో ఏమో ఎలా తెలుస్తుంది? ఏదేమైనా సరే! ప్రభువుకు మాత్రం ఒక ప్రత్యేకమైన బహుమతిని తీసుకుని వెళ్ళాల్సిందే. మరి ఏం తీసుకెళ్ళాలి చెప్మా! అంటూ తనలో తనే మధనపడిపోతూ ఇల్లంతా కలియదిరుగుతుంటే, అటకగూట్లో కనిపించిందో అచ్చుజటామంసి అత్తరుబుడ్డి. 'అబ్బ! సమయానికి సరైన ఆలోచన' అనుకుంటూ, అత్తరు బుడ్డిని పట్టుకుని ప్రభుని చెంతకు పరుగు తీసింది మరియ.

### మరియ కురులు

యేసును చూస్తూనే ఉద్వేగంతో నిండిపోయిందామె హృదయం. మూత తీసేంత సమయం కూడా ఆలస్యం కాకూడదన్నట్లు సీసాను పటుక్కున పగులగొట్టింది. అత్తరు ఆయన తలమీద పోసింది (మార్కు 14:3) అభిషక్తుడైన యేసు శరీరాన్ని, భూస్థాపన నిమిత్తం (ముందుగానే) మరోసారి అభిషేకం చేసేసింది (మార్కు 14:8) అంతటితో ఆగక ఆ సుగంధాన్ని, ఆయన పాదాలను స్పృశిస్తుంటే, ఒక్కసారిగా ఒళ్ళు ఝల్లుమనిపించింది. పాదాలు వచ్చి మాంసం ముద్దల్లాగున్నాయేమో! బాగా వాచి ఉన్నాయేమో! సువార్తను ప్రకటిస్తూ మైళ్ళ కొద్దీ దూరం నడవడం వల్ల పాదాలు కమిలి, పగిలి, ఎండిపోయినట్లున్నాయేమో! పాదాలను పట్టుకుంటుంటే భళ్ళుమంటూ గుండెల్లోంచి దుఃఖం తన్నుకు వచ్చింది. అప్రయత్నంగానే కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. మెల్లగా చేతుల్లోనికి తీసుకుని అత్తరు ఆయన పాదాలకు పూస్తుంటే, జలజలా జారుతున్న కన్నీరు ఆయన పాదాలను కడిగేస్తుంటే, ప్రభువు కాస్తంత సేదదీరుతుంటే పులకించి పోయిందా వనిత హృదయం. ఇంతమంచిపని చేస్తుంటే, అర్థంగాని వారు అమెను గూర్చి సణుక్కున్నారు.

అర్థంలేని విధంగా ఆమెను వారించజూశారు. ఇస్కరియోతు అడ్డుపడబోయాడు (యోహా 12:4-6) ఇంటి యజమాని అసలే మండిపడి పోయాడు. ఇప్పుడామెకో సమస్యొచ్చి పడింది. ప్రభుని పాదాలను శుభ్ర పరచేందుకు మెత్తని వస్త్రమేదైనా కావాలి. తానేమో తొందరలో మర్చిపోయి వచ్చింది. ఏంచెయ్యాలి! అని ఒక్క క్షణం ఆలోచిస్తుంటే తళుక్కున తట్టిందో తలంపు. అంతే! ఆసాంతం తలను నేలకు వంచింది. తల వెంట్రుకలతో ఆయన పాదాలను తుడిచింది (యోహా 12:3) ఆమె చేసిన కార్యాన్ని బట్టి సంతోషిస్తూ 'సర్వలోకములో ఎక్కడ సువార్త ప్రకటింపబడుతుందో అక్కడ ఈమె చేసినదియు జ్ఞాపకార్థముగా ప్రశంశించబడుతుంది (మార్కు 13:9)' అని ప్రభువు ఆమెను మెచ్చుకుంటాడు.

## ప్రశంశా కురులు

ఈ వృత్తాంతాన్ని జాగ్రత్తగా గమనించండి. ప్రభువు ఆమెను ప్రశంశించడానికి కారణాలేమయ్యుండవచ్చు? ఎందుకామె చేసింది జ్ఞాపకార్థంగా ఉంటుంది? మిక్కిలి వెలగల అచ్చ జటామాంసి సుగంధ ద్రవ్యాన్ని తెచ్చినందుకా! కాలుష్యంలేని కన్నీటితో ఆయన పాదాలు కడిగినందుకా! స్త్రీ గౌరవ సూచకంగా భావించే కురులతో ఆయన కాళ్ళు తుడిచినందుకా! ఇవన్నీ కారణాలు కావచ్చుగానీ ఎందుకో ఈ కురులకు మాత్రం కొంత ప్రత్యేకత ఉందనిపిస్తుంది. ఎందుకంటే వేల సంవత్సరాల ముందు జరిగిన మరియొక సంఘటనలో కూడా కురులెంతో ప్రముఖ పాత్ర వహించడం బైబిలు గ్రంథంలో గమనించగలం.

## సమ్సోను కురులు

ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులను నానా బాధలు పెడుతున్న ఆ కాలంలో, ఒకరోజు, యెహోవా దూత జొర్యా వంశస్థుడైన మనోహకు, అతని భార్యకు ప్రత్యక్షమై, వారికి పుట్టబోవు బిడ్డ ఇశ్రాయేలీయులను రక్షింప మొదలుపెడతాడనే శుభవార్తను తెలియజేస్తాడు. (న్యాయాధి 13:5) మరియు ఆ బిడ్డ తలమీద మంగలికత్తి వేయకూడదని, పుట్టినది మొదలుకొని దేవునికి వ్రతము చేయబడినవాడై ఉండాలని, ఆ దూత వారికి తెలియజేస్తాడు. ఆ తరువాత సమ్సోను జన్మించడం, ఫిలిష్తీయులను ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించడం, నక్కలతో వారి తోటలను తగలబెట్టించడం, గాడిద దవడ ఎముకతో వెయ్యిమంది ఫిలిష్తీయులను చంపడం, ఇత్యాది విషయాలన్నీ మనకు పరిచితమైనవే. అయితే అతని బలానికి కారణమైన తలవెంట్రుకలు క్షౌరము చేయబడినప్పుడు, (న్యాయాధి 16:16-19) దేవుడతనిని ఎడబాయుట వలన, అతను ఫిలిష్తీయుల చేతిలో బందీ అయ్యాడు. కానీ అతని తల వెంట్రుకలు మరలా మొలుచుటకు మొదలు పెట్టినప్పుడు, (న్యాయా 16:22) దేవుడతనికి బలం ఇవ్వడంతో, ఏకంగా ఫిలిష్తీయుల దాగోను దేవత గుడిని వట్టి చేతుల్తోనే తోసి కూల్చేశాడు. అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించే నమ్మలేని నిజమిది. అయితే మహాబలుడైన సమ్సోను బలానికీ, అతనకి దేవుడు తోడుగా నుండడానికీ, చటుక్కున లాగితే పుటుక్కున తెగిపోయే బలహీనమైన తలవెంట్రుకలకీ ఉన్న అవినాభావ సంబంధమేంటో అర్థం చేసుకోవాలంటే, ఈ తలవెంట్రుకల తత్వమేంటో తెలుసుకోవాల్సిందే.

## పాపరహిత కురులు

తలవెంట్రుకలు తలకు నప్పుతాయి. తలలోని పాపపు ఆలోచనలను కప్పుతాయి. తద్వారా దేవుని కోపాన్ని తాత్కాలికంగానైనా దూరంగా తిప్పుతాయి. నడిచినా, నిలిచినా, అవయువాలన్నింటికన్నా ముందే ప్రభుని ముందు నిలుస్తాయి. ఆ మాటకొస్తే, కురచనైతే నిలువుగా నిలిచినా, ఎదిగే కొద్దీ ఒదుగుతాయి. ఎంతగా ఎదిగితే అంతగా ప్రక్కకు జరుగుతాయి. విదేయతను ఆచరించి చూపుతాయి. వినయానికి తామే ప్రతినిధులమంటాయి. అయితే అన్నింటికన్నా ప్రాముఖ్యమైన మాటొకటుందంటాయి. ఆ లక్షణం మానవ దేహంలో మరే భాగానికీ లేనే లేకపోవచ్చుంటాయి. ఏంటా లక్షణమని ప్రశ్నిస్తే, పాపపంకిలమైన మానవదేహంలోని భాగమే అయినా, ఎన్నడూ ఏ పాపంలోనూ పాలిభాగస్తులం కాదనీ, ఖచ్చితంగా పవిత్రత మా సొంతమనీ చెప్పకనే

(మిగతా 21వ పేజీలో)



డా॥యేలూరి ఆశీర్వాదం

# పరలోక ధనము



**పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి. అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు. మత్తయి 6:20**

పరిశుద్ధ గ్రంధములో కానుకలు, మ్రొక్కుబడులు, దశమభాగములు, ప్రథమఫలములు, స్వేచ్ఛార్పణలు, ప్రతిష్ఠితార్పణములు, తొలిచూలు, ధాన్య-ద్రాక్షారసములు, నైవేద్యము, సాంబ్రాణి, నూనె, గొర్రెబొచ్చు వగైరాలను గూర్చి తేటతెల్లముగ వ్రాయబడెను.

### ఉపోద్ఘాతము

తాను చూచిన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు. (1 యోహాను 4:20,21) గనుక మనము బీదలకు సహాయం, అన్నార్తుల ఆకలి తీర్చుట, ఆపదలో నున్న వారిని ఆదరించుట, సువార్త సభలకు, రేడియో -టి.వి పరిచర్యలకు, చర్చి నిర్మాణములకు, అనాధ-పేద పిల్లల శరాణాలయములకు (ఆర్థిక) సహాయము చేయుట పరలోకధనము కూర్చుకొనుటయే గదా. మదర్‌థెరిస్సా లాంటివారిని జ్ఞాపకం చేసుకొనండి. మిషనరీలు త్యాగధనులు.

### మ్రొక్కుబడులు

దినదినము నా మ్రొక్కుబడులను నేను చెల్లించునట్లు నీ నామమును నిత్యము కీర్తించెదను.

మీ దేవుడైన యెహోవాకు మ్రొక్కుకొని, మీ మ్రొక్కుబడులను చెల్లించుడి. యెహోవాకు నా మ్రొక్కుబళ్ళు చెల్లించెదను. ఆయన ప్రజలందరి యెదుటనే చెల్లించెదను. అని కీర్తనలలో వ్రాయబడినవి. గనుక మనమును అలాగే దేవునికి మ్రొక్కి ఆ మ్రొక్కుబళ్ళును చెల్లించెదము.

### ప్రథమ ఫలము

"నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలమును, నీ ఆస్థిలో భాగమును యిచ్చి యెహోవాను ఘనపరచుము. అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగా నుండును. నీ గానుగలలోనుండి క్రొత్త ద్రాక్షరసము పైకి పొరలి పారును."

– సొలోమోను

లేవి 2:14–16

"మీ ప్రతిష్ఠితమైన అర్పణలను, మీ ప్రథమ ఫల దానములను ప్రతిష్ఠితము లగు మీ కానుకలన్నిటిని నేను అంగీకరించెదను అని యెహోవా సెలవిస్తున్నాడు.

"మీ ప్రతిష్ఠితార్పణములన్నిటిలోను తొలిచూలు వాటన్నిటిలోను మొదటి వియు, ప్రథమ ఫలములన్నిటిలోను మొదటివియు యాజకుల వగును. మీ కుటుంబములకు ఆశీర్వాదము కలుగు

నట్లు మీరు ముందుగా పిసికిన పిండి ముద్దను యాజకులకియ్యవలెను." అని యెహెజ్కేలు ద్వారా చెప్పెను.

**దశమ భాగములు**

రాజులను సంహారము చేసి తిరిగి వచ్చుచున్న అబ్రాహాము మహోన్నతుడగు దేవుని యాజకుడునైన మెల్కీసెదెకుకు అన్నిటిలో పదియవవంతు యిచ్చెను. దశమాంశములిచ్చిన అతని ఆశీర్వదించెను.

**పదియవభాగమియ్యని దొంగలు**

"పదియవ భాగమును, ప్రతిష్టితార్పణలను యియ్యక దొంగిలితిరి. ఈ జనులందరును నా యొద్ద దొంగిలుచునే యున్నారు. మీరు శాపగ్రస్తులైయున్నారు. నా మందిరములో ఆహారముండునట్లు పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొని రండి. దీని చేసి, మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపువాకిండ్లను విప్పి, పట్టజాలనంత విస్తారముగా దీవెనలను కుమ్మరించెదననియు, మీ పంటను తినివేయు పురుగులను నేను గద్దించెదను. అవి మీ భూమిపంటను నాశనము చేయవు." అని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చెను. (మలాకీ)

**ఎజ్రా-నెహెమ్యా**

యెహోవా మందిరమునకు వచ్చి, దేవునిమందిరమును దాని స్థలములో నిలుపుటకు కానుకలను స్వేచ్ఛర్పణములుగా అర్పించిరి.

మా పిండిలో ప్రథమఫలము, ప్రతిష్ఠితార్పణలు, సకల విధములైన వృక్షఫలములు, ద్రాక్షారసము, నూనె మొదలైన వాటిని మా దేవుని మందిరపు గదులలోనికి యాజకుల యొద్దకును, మా భూమి పంటలో పదియవవంతును ఆ లేవీయుల కిచ్చునట్లుగా నిర్ణయించుకొంటిమి. యూదులందరును ధాన్యద్రాక్షరస తైలములో 10వ భాగం ఖజానాలో వేసిరి.

**రాజైన హిజ్కియా ఆజ్ఞ**

ప్రథమఫలములైన ధాన్య-ద్రాక్షారసమును, నూనె, తేనే, సస్య ఫలములను విస్తారముగా తీసికొని వచ్చిరి. ఏమియు అపహరింపకుండ కానుకలు, 10వ భాగము, ప్రతిష్టిత వస్తువులు తెచ్చిరి. అట్లు మొదలు పెట్టినప్పటినుండి మేము సమృద్ధిగా భోజనము చేసినను చాలా మిగులు చున్నది. యెహోవా తన జనులను ఆశీర్వదించెను. మనముకూడా ఆ విధంగా చేసి ఆశీర్వాదం పొందుదాం.

**యేసు**

కైసరువి కైసరునకును, దేవునివి దేవునికిని యివ్వవలెను. బాగుపడిన కుష్టరోగితో-నీవు శుద్ధడవైనందుకు మోషే నియమించిన కానుకను చెల్లించుమని ఖండితముగా ఆజ్ఞాపించెను.

**బీద విధవరాలి కానుక**

ప్రభువైన యేసు కానుకపెట్టె యొద్ద కూర్చుండెను. అందరును కానుకలు వేయుట చూచెను. ధనవంతులైనవారు తమ కలిమిలో సొమ్ము ఎక్కువ వేసినను, అందరికంటే ఎక్కువ బీద విధవరాలు వేసెనని తన శిష్యులతో చెప్పెను. (ఆమె తన లేమిలో రెండు కాసులు (తన జీవనమంతయు) వేసెను.)

**ఆదిమ సంఘం**

తమ చర-స్థిరాస్తుల నమ్మి అపొస్తలుల పాదముల యొద్ద పెట్టుచు, అందరు సమిష్టిగ, ఏకమనస్సుతో, ఏకాత్మతోనుండిరి. కుప్రలోని యోసేపు భూమిగల వాడైనందున అతడు తన భూమిని అమ్మి, ఆ సొమ్మును అపొస్తులుల పాదముల యొద్ద పెట్టెను.


**పరిశుద్ధులకొరకైన పరిచర్య-చందా**

అపొస్తలుడైన పౌలు కొరింథీ సంఘమునకు వ్రాసిన లేఖలో మీ ధర్మము వినితనముగా కాక ధారాళముగ యియ్యవలెనని చెప్పెను. సణుగు కొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును.

**ముగింపు**

పుచ్చుకొనుట కంటే యిచ్చుట ధన్యత. (అ.కా 20:35) నూర్చెడి ఎద్దు మూతికి చిక్కము వేయరాదు. (ద్వితీ 25:4) మందను మేపువాడు మందపాలు త్రాగుట తగదా?

ఉపదేశము పొందువాడు ఉపదేశించు వానికి మంచి పదార్థములన్నిటిలో భాగమియ్యవలెను. ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆనక్తులునైయుండుడి. వెదజల్లి అభివృద్ధిపొందువారు కలరు. తగిన దానికన్న తక్కువ యిచ్చి లేమికి వచ్చువారు కలరు. (సామె 11:24) పరలోకధనము కూర్చుకొందుము. ప్రభువు రాకడకు సిద్ధపడుదుము గాక! ఆమేన్!



రెవ. డా॥ డి. వి. డానియెల్

# అన్యాయపు సిరి



పూర్వము జమీందారులు, ఐశ్వర్యవంతులు, ధనికులైన యజమానులు, వ్యాపారస్థులు-తమ ఆర్థిక వ్యవస్థలను అజమాయిషీ చేసెందుకు గృహనిర్వాహకులను నియమించుకొనేవారు. యజమాని రాబడికి, ఖర్చులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యజమానులకు నివేదించడం గృహనిర్వాహకులు విధుల్లో ఒకటి మన తెలుగు బైబిల్లో "గృహనిర్వాహకులు", "విచారణకర్తలు" అన్నారు (ఆది. 39:4; 43:10). మరోక తెలుగు తర్జుమాలో "గుమస్తా" అన్నారు. కొన్ని ఇంగ్లీష్ తర్జుమాల్లో Steward (KJV, RSV), Servant (GNB), Agent (JBP, Moffath) అన్నారు. మన దేశంలో కూడ జమీందార్ల దగ్గర అలాంటివారుండేవారు నమ్మకమైన గృహనిర్వాహకునికి కొందరు తమ ఇల్లంతటిని అప్పగించేవారు (ఆది 39:4).

ఐతే కొందరు ఏజెంట్లు మోసగిస్తూ, యజమానికి నష్టం కల్గిస్తూ ఉండేవారు. అలాంటి మోసగాడైన ఒక ఏజెంట్‌ను గూర్చి యేసు ప్రభువు ఒకసారి చక్కని బోధ విన్పించాడు (లూకా 16:1-13). ఆ ఉపమానంలో కన్పించేది నల్గురు వ్యక్తులు - యజమాని, గృహనిర్వాహకుడు, ఇద్దరు ఋణస్థులు.

## యాజమానుడు

తన ఏజెంట్ ఆస్థిని పాడుచేస్తున్నాడని యజమానికి తెల్సిపోయింది. క్రితంలో ఎన్నడు యజమాని ఏజెంట్‌ను మందలించినట్టు లేదు. హెచ్చరించినట్టు కూడా లేదు. ఒకేసారి దోషారోపణ, తక్షణమే బర్తరఫ్ (డిస్మిస్సల్). యజమాని కూడా మోసం చేసి సంపాదించి వుంటాడు. అతని సంపాదన విధానం ఏజెంట్ ఎరిగే వుంటాడు. తనతోనే తప్పుడు లెక్కలు వ్రాయించే వాడేమో యజమాని! వివరాలకు పోతే తన గుట్టు రట్టవుతుందేమోనని "లెక్క అప్పగించు, నా ఏజెంట్‌గా నీవు ఉండడం కుదరదు" అన్నాడు యజమాని.

## ఏజెంట్

యజమాని నిర్ణయం విని, ఏజెంట్ బ్రతిమాలినట్టుకాని, క్షమాపణ చెప్పినట్టు కానిలేదు. ఏజెంట్ భయపడలేదు. వాదించలేదు. పదవీ విరమణకు సిద్ధమయ్యాడు. అనగా నేరాన్ని అంగీకరించాడన్న మాట! ఐతే "త్రవ్వలేను" (కూలిపని చేయలేను). "భిక్షమెత్త సిగ్గుపడుచున్నాను" (ఇన్నాళ్ళు ఏజెంట్‌గా దార్జాగా పనిచేసి బిచ్చగానిగ ఎలా బ్రతుకగలను?) అనుకొని వెంటనే కార్యాచరణకు ఉపక్రమించాడు.

యజమానికి అప్పున్న ఇద్దర్ని ఆశ్రయించాడు. ఒకని అప్పును 50 %, రోండోవాని అప్పును 20% తగ్గించి వ్రాసుకోమన్నాడు. అనగా అప్పటికే చేసిన మోసాలకు అదనంగా మరి రెండునేరాలు కలిపి నేరభారం పెంచుకొన్నాడు. ఈ చర్యలు యజమానికి మరింత నష్టం కల్గిస్తాయని ఎరిగినా - అదంతా యజమాని ఎరిగినా - అదంతా యజమాని అన్యాయార్జనే కదా అని సమర్థించుకొని ఉంటాడు. యజమాని

కిటుకులు ఎరిగిన గుమాస్తా నిర్భయంగా మోసాలు చేయగలడు. "యథా రాజా, తథా ఏజెంటు" కథ.

## ఇద్దరు ఋణస్థులు

వాళ్ళిద్దరు నిజాయితీపరులైతే "యజమాని నన్ను లెక్కలు అప్పగించమంటే, మమ్మల్ని తప్పుడు లెక్కలు వ్రాసికోమంటావేంట్రా?" అనేవారు. వాళ్ళేమనకుండా ఏజెంట్ సలహాను పాటించినట్టుంది. ఒకనికి 50 శాతం, మరోకనికి 20 శాతం అప్పు తగ్గింది. ఇంకేం కావాలి? ఏజెంట్‌కు "థ్యాంక్యూ" చెప్పి వుంటారు.

ఈ లావాదేవీలు కూడ యజమాని చెవిలో పడ్డాయి. ఎలా తెల్సిందో! బహుశా 20 శాతం వాడో 50 శాతం వాడో వాని మీద అక్కసు వల్ల యజమానికి చెప్పి ఉంటాడేమో! యజమాని ఆ గృహనిర్వాకుని యుక్తిని మెచ్చుకొన్నాడని ప్రభువు చెప్పాడు (లూకా 16:8). ఈ ఉపమాన భావాన్ని ప్రభువే వెల్లడించాడు. "అన్యాయపు సిరి వలన మీకు స్నేహితులను సంపాదించుకొనిడి" (16:9). అనగా మీరు అర్జించిన అన్యాయపు సిరిని అలా వెదజల్లితే మీకు మిగిలేది-లోకంలో స్నేహితులు, మీకు నిత్యనివాసాలు. "మిక్కిలి కొంచెములో... అన్యాయముగ ఉండువాడు ఎక్కువలోను అన్యాయముగా ఉండును" (16:10). అన్యాయార్జన చేసేవారు అన్యాయాన్నే మెచ్చుకుంటారు. ఈ ఉపమానాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

1) సర్వమానవకోటికి, సర్వజీవరాశికి, సకల సృష్టికి యాజమానుడు-దేవుడు. ఆయనే సృష్టికర్త. మన దేహాలు, మన ఊపిరి (హిబ్రూలో "రుహా", గ్రీకులో "న్యుమ") మనవి కావు. (ఆది.1). దేవుడు తన సృష్టిని మానవుని చేతికప్పగించి, "ఏలుడి" అన్నాడు. అనగా మానవుడు-దేవుని గృహ నిర్వాహకుడు, యజమాని దేవుడే. దేవుడు అశరీరుడు, ఆత్మ. కనుక భౌతిక సృష్టిని ఆయనస్థానే ఏలుబడి చేయలని శరీరులైన మానవులకప్పగించాడు. మనం-ఆయన రాయబారులం, ఏజెంట్లం, సేవకులం, గుమాస్తాలం (1కొరిం 4:1). "గృహనిర్వాహకులలో ప్రతివాడును నమ్మకమైన వాడైయుండట అవశ్యము" (4:2). "దేవుని యిల్లంతటిలో మోషే నమ్మకముగా ఉండినట్లు ఈయన(క్రీస్తు) కూడ తనను నియమించిన వానికి (యజమానికి) నమ్మకముగా ఉండెను. ఈయన (క్రీస్తు) మోషే కంటే ఎక్కువ మహిమకు అర్హుడుగా ఎంచబడెను. మోషే పరిచారకుడైయుండి దేవుని యిల్లంతటిలో నమ్మకముగా ఉండెను (సంఖ్యా 12:6,7) అయితే క్రీస్తు కుమారుడైయుండి ఆయన యింటిమీద నమ్మకముగా ఉన్నాడు. మనమే ఆయన యిల్లు" (హెబ్రీ 3:2-6). దేవుని ఆస్థియైన ప్రకృతికి కాని, సంఘానికి కాని, మన దేహానికి కాని హాని చేయరాదు.

2) దేవుని ఆస్థిని పాడుచేస్తున్న మనలను శిక్షించక, కృపతో క్షమించి తన సొంత బిడ్డలుగ జీవిస్తు, తన పితృత్వానికి వారసులుగ వాడుకుంటు, మారుమనస్సుకు అవకాశమిస్తు కృపవెంబడి కృపను మనపై కుమ్మరిస్తున్నాడు. మన యజమాని (యోహాను 1:16). ఆయన మనకప్ప గించిన దానిని గూర్చి ఆయనకు లెక్క అప్పగించాలి సుమా!

3) కాలమానరీత్యా ఈ లోక భవిష్యత్ తాత్కాలికం. శాశ్వత భవిష్యత్ ఒకటుంది. మనం మరణించాక అది ఆరంభ మవుతుంది. అది దైవసాన్నిధ్యమే కావచ్చు లేక అగ్నిగుండమే కావచ్చు. అన్యాయపు సిరిపై ఆశలు పెట్టుకొని జీవిస్తే శాశ్వత నరకం తథ్యం.

4) అన్యాయపు సిరిమంతుడు అందించే మెప్పు అన్యాయమైన మెప్పు. అతడు మన "యుక్తిని" అభినందిస్తాడు. విశ్వమానవ యజమాని న్యాయాధిపతి కనుక మన "భక్తి"ని అభినందిస్తాడు. "యుక్తి"మయ జీవితానికి "భక్తి"యుత జీవితానికి పొంతన పొసగదు.

5) అశాశ్వత భవిష్యత్ కోసమే "ఏజెంట్లు" "యుక్తిగా ప్రవర్తిస్తే పరలోకంలో లభ్యమయ్యే శాశ్వత భవిష్యత్‌ను ఆశించే మనం ఇంకెంత "భక్తి"యుతంగా జీవించాలో! మన శాశ్వత యజమాని మానవుడు కాదు సమా! ఈ వేద వాక్కులను చదివి ధ్యానించండి. (యోహాను 12:43; రోమా 2:9; 1కొరింథీ 4:5; ఎఫెసీ 6:9; కొలస్సీ 4:15; 1పేతురు 1:7)


## ముగింపు

"భక్తి" అనగా బైబిల్ చదవడం, ప్రార్థించడం, ఆలయానికి వెళ్ళడం, కానుకలివ్వడం, ఏదో కార్యనిర్వహణ మాత్రమే కాదు. మన శాశ్వత యజమాని మనల్ని నమ్మి తన ఇల్లంతయు అప్పగించగా మనం ఆయన నమ్మిన "గృహ నిర్వాహకుల"మయ్యాము. అన్యాయపు సిరినార్జిస్తున్న సంఘ విద్రోహులు ఏజెంట్స్‌ము కాము. నమ్మకంగా ఆయన పని చేస్తూ, దుర్వ్యసనాలకు దూరమై, నిర్మలమైన మనస్సాక్షితో ఆయన్ను ప్రేమిస్తూ, ఇతరులకు ప్రేమఫలాలనందిస్తూ, మన విశ్వాసం ద్వారా ఆయన కృపచేత "నీతి మంతులము"గా తీర్పుపొందడమే నిజమైన భక్తి. అప్పుడాయన మనల్ని. తండ్రి సాన్నిధ్యంలో "భళా నమ్మకమైన మంచి దాసుడా" అని సంబోధించి జీవకిరీటాన్ని బహుకరిస్తాడు. అయన మెప్పునే ఆశిద్దాం.

ఆధ్యాత్మిక లోతులు

ప్రవాసి

# క్రీస్తు లేని క్రైస్తవ్యం



**నేను** పుట్టు క్రైస్తవుణ్ణి అంటున్నాడు ఓ ఆసామి! కాని, అది అబద్ధం. పుట్టు పాపులుంటారు గాని, పుట్టు క్రైస్తవులుండరు. క్రైస్తవ విశ్వాసం, ఆనువంశికంగా రాదు. మా తండ్రి అబ్రాహాము అని విర్రవీగే యూద మతస్థులను పట్టుకుని యేసు "మీ తండ్రి సైతాను" అన్నాడు ఎందుకంటే వారు సైతాను క్రియలే చేస్తున్నారు!

### ఆత్మ వంచన

మతాచారాల వల్ల ఎవ్వరూ క్రైస్తవులు కారు. దేవుని వాక్యాన్ని నిరర్ధకం చేసే సాంప్రదాయాలను, ఆచారాలను పట్టుక వేళ్ళాడుతూ మేము క్రైస్తవుల మనుకొని ధీమాతో వున్నవారు ఆత్మవంచన చేసికొంటున్నారు. ఎన్నిసార్లు స్నానం చేసినా ఆత్మకు శుద్ధి కలగదు. హృదయ శుద్ధికి యేసు రక్తమే కావాలి. మతం మార్చుకున్నంత మాత్రాన హృదయం మారినట్లు కాదు. గారడీ సీమోను మతం మారినా, హృదయం మారని నామాకార్థ క్రైస్తవుడు. అతడి తలలో ఉన్న విశ్వాసం హృదయంలోకి యింకలేదు. పేరు మార్చుకుంటారు. మతం మార్చుకుంటారు. తీరు మారదు. గతం మారదు. అదే పాతరోత బతుకు. విషం సీసా మీద అమృతం అని రాసినంత మాత్రాన అది అమృత మవుతుందా? వట్టిమాట. మనిషి ఆంతర్యం యేసుకు బాగా తెలుసు. లౌకిక ప్రయోజనాల కోసం క్రైస్తవులయ్యేవారు విశ్వాసులు కానేకారు. ఇలాంటివారు ఏశావు కోవకు చెందినవారు. పూటకూటి కోసం కక్కుర్తిపడే రకాలు. పేరుకు మాత్రం క్రైస్తవులైన వారిని పట్టిచ్చే గుర్తులు కోకొల్లలు. చెట్టు తరహా ఫలాలను బట్టి యిట్టే తెలిసిపోతుంది.

### చౌకబారు కృప

సినిమాలు చూడ్డానికి, అశ్లీలమైన పాటలు మాటలు చెప్పేవారు, తాగుడు, చుట్ట, బీడి, సిగిరెట్టు అలవాట్లున్న వారు, చౌకబారు కామ సాహిత్యం చదివే వారు ఈ విషా ముష్టి ఫలాలను బట్టి తామెవరో చెప్పకే చెబుతున్నారు. నామకార్థ క్రైస్తవులకు ఘోర శిక్ష తప్పదు. వీరు బాప్తీసం తీసుకుంటారు. ప్రభువు

ప్రార్థనంటూ వల్లిస్తారు. విశ్వాస ప్రమాణం కళ్ళు మూసుకుని మరీ అప్పజెపుతారు. పది ఆజ్ఞలూ పదే పదే పాటగా చెబుతారు. అయినా వీరు రక్షణ పొందిన వారు కానేకారు. ఆదివారపు ఆరాధనలో ఆసాంతము కూచుంటారు. కాని శరీరాశ, నేత్రాశ వీరిని పట్టి పల్లార్చుతూ ఉంటాయి. వీరిది పాతరోత బతుకు! క్రీస్తునందు ఉంటే గదా వీరు నూతన సృష్టి అవటానికి?

## హృదయ విశ్వాసం

చెల్లని నాణేల వంటి క్రైస్తవులున్నారు. వారి విశ్వాసం అసలైంది కాదు. నకిలీ విశ్వాసం. ప్రకటన 12:9లో సైతాను సర్వలోకాన్నీ మోసగిస్తున్నాడు. నామకార్థ క్రైస్తవులంతా సైతాను చేతిలో దగా తిన్నవారే! విశ్వాసం వేదో జన్మం కాదు. హృదయంలో వుంటుంది. మానసిక విశ్వాసం చాలదు. హృదయ విశ్వాసం కావాలి. ఫలరహితమైన వ్యర్థమైన విశ్వాసంలో ఎవరు క్రైస్తవులు కాలేరు. రాతి హృదయంలో దేవుని వాక్యం మొలకెత్తదు.

హృదయస్థమైన విశ్వాసం మనిషి రక్షణకు బాసట! హృదయంలో ఉన్న పాపవిషానికి క్రీస్తునందలి హృదయ విశ్వాసమే విరుగుడుమందు. పాపి తన పాపాన్ని ఒప్పుకొని, విరిగి నలిగిన హృదయంలో యేసును రక్షకుడుగా స్వీకరిస్తే చాలు. రక్షణ ప్రాప్తిస్తుంది. 1 యోహాను 1:9 పరిశుద్ధాత్మ యేసుప్రభువు యొక్క రక్తాన్ని పాపి హృదయానికి అన్వయిస్తాడు. సజీవుడైన యేసు హృదయశుద్ధిగలవారిని నడిపిస్తారు. హెబ్రీ 2:10 యేసే మన రక్షణకర్త, విమోచకుడు. ఇదే రక్షణదినం. అనుకూల సమయం. క్రీస్తు విశ్వాసిలో జీవిస్తాడు. విశ్వాసి ద్వారా పనిచేస్తాడు. క్రైస్తవ పగటివేషాలను చూచి మోస పోవద్దు. బుద్ధిలేని కన్యకలు బుద్ధిగల వారిలాగా నటించి, అవమానం పాలయ్యారు.

## మిశ్రమ ప్రజ

రామసేసు నుంచి సుక్కోతుకు ఇశ్రాయేలు ప్రజలు తరలి వెళ్ళారు. వీరితో మిశ్రమ జనాంగం వున్నారు. కలగాపులగం క్రైస్తవులు ఈ రోజున ఉన్నారు. వారికి అంతిమ దినాన తీర్పు తప్పదు. అలనాడు అరణ్య ప్రయాణంలో మిశ్రిత ప్రజలు తిండికోసం ఏడ్చారు. దేవుడిచ్చిన మన్నాతో వారికి తృప్తి కలుగలేదు. ఈజిప్టు తిండికోసం వూరికే అఘోరిస్తున్నారు. వీరు శరీరానుసారులు. మిశ్రిత జనాంగం పాము కాటుకు అధిక సంఖ్యలో చచ్చారు. నేటి మిశ్రమ క్రైస్తవ జనానికి రేపు అగ్ని గంధకాలున్నాయి జాగ్రత్త!

అమ్మోనీయులు, మోయాబీయులు నిషిద్ధ ప్రజలు. వీరు సమాజములోనికి ఎలాగో జొర బడ్డారు. బెన్నమ్మి, మోయాబు అనే ఇద్దరు లోతుకు కలిగిన దుష్టసంతానం. వీరు వంశికులే అమ్మోనీయులు, మోయాబీయులు. వీరే మిశ్రమ ప్రజలు. వీరిని నెహెమ్యా పసికట్టాడు. ఇశ్రాయేలీయుల సమాజములోనుండి వీరిని ఏరి పారేశాడు. (నెహెమ్యా 13:3)

## క్రీస్తునందు

క్రీస్తునందు అనే స్థితి విశ్వాసి యొక్క ఉనికిని వివరిస్తుంది. క్రీస్తునందు నీవు నూతన సృష్టివి. క్రీస్తునందు తీర్పునుండి రక్షణ. క్రీస్తునందు పరలోక స్థలంలో సింహాసనం మీద కూచునే భాగ్యం. క్రీస్తునందు క్రీస్తు మనస్సు కలుగుతుంది. పాతవి గతిస్తాయి. అన్నీ కొత్తవవుతాయి. ఇదే క్రీస్తునందు సంయోగ క్రియ. క్రీస్తునందు క్రీస్తు వ్యక్తిత్వం ఏర్పడి వృద్ధి చెందుతుంది. నూతన జీవం కలిగి నడుస్తాము. మారాలోని చేదునీరు క్రీస్తునందు మధుర జలమవుతుంది. మోషే చేదు నీటిలో ఓ చెట్టును వేశాడు. ఆ చెట్టు యేసుక్రీస్తే.

యెరికోలో ఎలీషా ఉన్నాడు. అక్కడి నీళ్లు మంచివికావు. అందులో ఉప్పువేసి ఎలీషా ఆ నీటిని స్వస్థపరిచాడు. క్రీస్తునందు తీర్పులేదు. క్రైస్తవులై ఉండి కూడా క్రీస్తునందు వుండని వారికి తీర్పు తప్పదు. క్రీస్తునందే మన ఆశ్రయం. హెబ్రోను అనే ఆశ్రయపురం అబ్నేరుకు దగ్గరే వుంది. అయినా యోవాబు అబ్నేరును చంపాడు. ఆశ్రయపురానికి తను సమీపంలోనే ఉన్నా, అతనికి ఆశ్రయం లేదు. చచ్చాడు. అలాగే యేసుక్రీస్తుకు నామకార్థ క్రైస్తవులు చాలా సమీపంగా ఉండి కూడా క్రీస్తుకు బయటే నశిస్తారు.

క్రీస్తునందు విశ్వాసి అత్యున్నతమైన పదవికి హెచ్చింప బడతాడు. పైకి ఎక్కి వెళ్ళాలంటే క్రీస్తునందు వుండాలి. నిలిచివుండాలి. దేవాశీస్సులు! ఆమేన్!



మారిన జీవితాలు

జి.విజయరావు

# పాప పరిష్కారం

**అనుభవ సాక్ష్యం, సందేశం**



**సాక్ష్యం** అనగా చూచిన, వినిన, అనుభవించిన వాటిని ఇతరులతో పంచుకోవడం. ఇలా పంచుకోవడంలో నా ఉద్దేశ్యం ఏమిటి అంటే బైబిల్ సందేశాలు (దేవుని మాటలు) ప్రతివ్యక్తి ఆత్మను రక్షించే శక్తి గలివి. అనుభవపూర్వకంగా నేను తెలుసుకున్న విషయాలు మీతో పంచుకోవాలని నా కోరిక.

ఈ బైబిల్ సందేశాలు వ్యక్తిగతంగా నాలో కలిగించిన పరివర్తనను మీతో పంచుకోగోరతాను.

జీవితం యొక్క విలువ ఏమిటో తెలియకుండా, లక్ష్యం, గురి లేకుండా తినుచూ, త్రాగుచూ, ఇంకా అనేక రకాల చెడు అలవాట్లలో కాలక్షేపం చేస్తూ జీవిత యాత్రను కొనసాగిస్తూ ఉండేవాణ్ణి. అప్పుడప్పుడు రేడియోలో వచ్చే ప్రేమధార బైబిల్ అధ్యయన పాఠాలు వినేవాడ్ని. అలా వింటూ ఉండగా దేవుని మాటలు నా హృదయంలో పాపము, తీర్పులను గురించి ఒప్పుదల కలిగించాయి. ఆధ్యాత్మిక స్పృహ కలిగింది.

మన సృష్టికర్త అయిన దేవునికి అభ్యంతర కార్యము, దేవునిపై తిరుగుబాటు, దేవుడు చెప్పింది చేయకుండా చేయవద్దు అన్నవాటిని చేయడం. దేవునికి వ్యతిరేకంగా పనిచేయడం. దేవుడు న్యాయాధిపతి అందరికి ప్రధానతీర్పరి. పాపస్వభావం అంతటికి నరకాన్ని తీర్పు తీర్చేది మనసృష్టికర్త అయిన దేవుడు.

బైబిల్ సందేశాలు వినడం వల్ల నా హృదయంలో పాపము, తీర్పులను గురించి ఒప్పుదల కలిగించాయి.

క్రైస్తవ కుటుంబములో పుట్టి నేను జీవిస్తున్న ఈ జీవితం మంచిది కాదు. నా హృదయం మోసకరమైనది అని నా మీద నాకే అసహ్యం కలిగింది. నా భౌతిక మరణం తరువాత నా ఆత్మ నరకానికి చేరుతుందని జీవితం పట్ల అసంతృప్తి, నిరాశ కలిగాయి.

మరి నేను ఈ పాప స్వభావంతో చస్తూ, చస్తూ చివరికి శాశ్వతంగా నరకానికి వెళ్ళవలసిందేనా? నేను అనుభవిస్తున్న ఈ పాప సమస్యలకు పరిష్కారం లేదా? అనే ఆలోచనలతో ఉండి రేడియోలో వచ్చే బైబిల్ సందేశాలు వింటూ ఉండేవాణ్ణి. స్పందన ఆధ్యాత్మిక మాసపత్రికల సందేశాలు చదువుతూ ఉండగా నాలో ఉన్న ప్రశ్నలన్నింటికి, నా హృదయంలో ఉన్న పాప సమస్యలకు క్రమ, క్రమంగా పరిష్కారాలు లభించాయి. దేవునికి స్తోత్రం.

నేను నిలువెల్ల పాపిని, నేను పాపం చేసినందు వల్ల మాత్రమే పాపిని కాదు. నేను జన్మతః పాపిని. నా హృదయం మోసకరమైనది, నాలో దేవునికి లోబడే స్వభావం లేదు. నన్ను నేను రక్షించుకోలేని నిస్సహాయుడను. (క్రీస్తుకు బయట ఉన్న మానవతకు జీవంలేదు) అయితే దేవుడు లోకమును ఎంతో ప్రేమించి నశించిన నన్ను వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారు. తన మాటలు వినిపించారు. నాకు సేవచేసాడు. నేను చేసిన సర్వకాల పాపములకు నాకు బదులుగా తాను ప్రాణత్యాగం, రక్తప్రోక్షణ చేసినాడు. నా అతిక్రమములకు తాను ప్రాయశ్చిత్తం చేసాడు. నేను నా సృష్టికర్తను సిలువవేసి హత్యచేసాను. దేవుడు సహనంతో వ్యవహరించి గొప్ప వెల చెల్లించాడు.

ఇంత గొప్ప వెల చెల్లించుటకు నేను అర్హుడను కాను. పాపిని అయిన నన్ను ప్రేమించి నన్ను తనలోకి ఆహ్వానించాడు. (యేసు **"ప్రయాసపడి భారము మోయుచున్న సమస్త ప్రజలారా నా వద్దకు రండి. నేను మీకు విశ్రాంతిని కలుగజేస్తాను. నా వద్దకు వచ్చువారిని నేను ఎంత మాత్రమును త్రోసివేయను.''**) ఇదంతా దేవుని ఉచితకృప.

ఆయన నాకు అనుగ్రహించిన కృపకు ప్రతిస్పందనగా నేను యేసు క్రీస్తును నా స్వకీయ రక్షకుడిగా అంగీ కరిస్తూ నేను చేసిన పాపములన్ని అయనతో ఒప్పుకుంటూ దేవునితో సమాధానపడుతూ క్షమాపణ వేడుకున్నాను. 1 యోహాను 1:9 ప్రకారం యేసురక్తం నా మనసాక్షిని కడిగి శుద్ధిచేసింది. (పాప క్షమాపణ అనుభవం లేనిదే మనసాక్షికి నెమ్మది ఉండదు.)

యేసుక్రీస్తును అంగీకరించిన వారికి అందరికి దేవుని పిల్లలు అయ్యే అధికారం దేవుడే అనుగ్రహించాడు. అంగీకరించిన వారు అందంరూ దేవుని వల్ల పుట్టినవారే.

యేసుక్రీస్తు పాపములను క్షమించే అధికారం కలిగి ఉన్నారు. యేసురక్తం మనసాక్షిని కడిగి శుద్ధి చేస్తుంది.

అందరు రక్షించబడాలని దేవుని చిత్తం. క్రైస్తవ్యం "మతం" కాదు. ఇది క్రీస్తు ప్రతిపాదించిన క్రొత్త జీవిత విధానం. బైబిల్ (దేవుని మాటలు) దేవుడు మానవతకు ఇచ్చిన ప్రేమసందేశం. దేవుని మాటలు వినుట వల్ల విశ్వాసం కలుగుతుంది. ఇది నా అనుభవ సాక్ష్యం. మనందరికి యేసుతో సహానుభవం కలుగునుగాక! ఆమేన్!

## దయచేసి ప్రార్థించండి

1. **పాఠకులకు అప్పుడప్పుడు యం.ఓ ఫారంలు పంపిస్తున్నాము. ఈ పరిచర్య కోసం ప్రార్థించండి. మీ చందాలు, కానుకలు పంపటానికి యం.ఓ ఫారంను ఉపయోగించండి.**
2. **యం.ఓ ఫారంలో మీ పూర్తి పోస్టలు అడ్రసు రాయండి. మరువకండి.**
3. **స్పందన అడ్రసులు కంప్యూటరు సాఫ్ట్‌వేర్ అవసరత ఉంది. ప్రార్థించండి.**
4. **మీ ప్రతి యం.ఓ లో, ఉత్తరంలో మీ మొబైల్ నంబరు రాయటం మరువకండి.**
5. **మీ ఉత్తర ప్రత్యుత్తరాలలో తప్పక మీ కోడ్ నంబరు వేయండి.**

మీ కోడ్ నంబరు

```
KR 628              PATRON
THOTA VENKATESWARA RAO,
S/O.T.RADHA KRISHNA,
IBRAHIMPATNAM (FERRY),
KRISHNA DIST - 521 456.
```

ప్రసంగ వేదిక

# క్లుప్త ప్రసంగాలు

## దేవుని స్వరూపము కొలస్సీ 1:15

1. మహిమాస్వరూపి. ఎఫెసీ 1:17-19
2. నీతి స్వరూపి. యోహాను 17:25
3. సత్యస్వరూపి. ప్రకటన 6:10
4. ఆత్మ స్వరూపి. యోహాను 4:24, 1 పేతురు 3:19,20
5. ప్రేమస్వరూపి. 1 యోహాను 4:8
6. దాసుని స్వరూపం. ఫిలిప్పీ 2:7
7. దేవుని స్వరూపం. ఫిలిప్పీ 2:6

## దేవుడు నిన్ను ప్రేమించి 1 యోహాను 4:10

1. మనలను ప్రేమించి తన కుమారుని మన కొరకు అనుగ్రహించెను. యోహాను 3:16.
2. మనలను ప్రేమించి తన జనముగా ఏర్పరచుకొనెను. ద్వితీ 7:7,8
3. మనలను ప్రేమించి ఆశీర్వదించును. ద్వితీ 7:13
4. ప్రేమించి శాపమును ఆశీర్వాదముగా మార్చును. ద్వితీ 23:5
5. మన పాపముల నుండి విడిపించును. ప్రకటన 1:6
6. మనలను ప్రేమించి జయము నిచ్చును. రోమా 8:37
7. మనలను ప్రేమించెను గనుక విడువడు. యిర్మియా 31:2

## యేసు రక్తము

1. ప్రతి పాపమును కడుగును. 1 యోహాను 1:7
2. యేసు రక్తము ద్వారా విమోచనము కలుగును. ప్రకటన 1:6
3. యేసు రక్తము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుదురు. రోమా 5:9
4. యేసు రక్తము ద్వారా మనకు సమాధానము కలుగును. కొలస్సీ 1:20
5. యేసు రక్తము ద్వారా మనము పరిశుద్ధ పరచబడుదుము. హెబ్రీ 13:12
6. యేసు రక్తము ద్వారా మనము సమీపస్థులమగుదుము. ఎఫెసీ 2:13
7. యేసు రక్తము ద్వారా మనకు విజయము లభించును. ప్రకటన 12:11

## ఆలోచించండి

1. యేసుక్రీస్తు గురించి ఆలోచించండి. యెషయా 53:8
2. మన ప్రవర్తన గురించి ఆలోచించుట. హగ్గయి. 1:5
3. యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచించుట. 2 కొరింథీ 8:21
4. దేవుని అద్భుత క్రియలను గూర్చి ఆలోచించుట. యోబు 37:14
5. దేవుని నిత్యశక్తి, దేవత్వమును గూర్చి ఆలోచించుట. రోమా 1:20
6. పరిశుద్ధుల అవసరము గురించి ఆలోచించుట. ఫిలిప్పీ 4:10
7. మేలు చేయుటకు. 2 థెస్స 1:11,12

(11వ పేజి తరువాయి)
చెప్పుతాయి. ఏ మానవుడైనా సరే, తల్లక్రిందులుగా తపస్సు చేసినా సరే, తలవెంట్రుకలతో పాపంచేయనే చేయలేడని, ఒకింత అతిశయంగానైనా వినయంగానే తెలుపుతాయి. పట్టుకుంటేనే పుటుక్కున తెగిపోయే బలహీనమైన కురులకెంత బలమైన సాక్ష్యమో! ఆలోచిస్తే ఆశ్చర్య మనిపిస్తుంది.

నిజమే! శరీరంలోని ఏ అవయువమైనా పాపంలో పాలు పంచుకోవచ్చేమో గానీ, కల్మషం కలవని కురులు మాత్రం ప్రత్యేకమైనవి. పవిత్రతకే ప్రతిరూపమైనవి. అందుకేనేమో బలహీనుడైపోయిన సమ్సోను తిరిగి తలవెంట్రుకలు వచ్చాకే ఎప్పటిలా బలాన్ని పొందుకోగలిగాడు. అలాంటి తలవెంట్రుకలతో ఆయన పాదాలను తుడిచింది గనుకనే మరియ చేసిన కార్యం నేటికీ ప్రశంసించ బడుతూ వుంది. అక్షరార్థంగా చూస్తే తలవెంట్రుకలు వచ్చాకే సమ్సోను బలాన్ని తిరిగి పొందాడు గానీ, అంతరార్థంగా చూస్తే, మనసు మారాకనే, చెడువిడిచాకనే, మంచిగా నడిచాకనే ప్రభుని ప్రార్థించాకనే, జీవితంలోని పాపం పారిపోయిందనీ, పవిత్రపరచబడిన అతని జీవితంలోనికి ప్రభువిచ్చిన బలం వచ్చిందని అర్థం.

ఇలాంటి అంతరార్థంతోనే కావచ్చు, ఇష్టమైన చోట ఇష్టమైన కురులను అర్పించే ఆచారం చాలా సాంప్రదాయాల్లో ఉంది. కొన్ని క్రైస్తవ సాంప్రదాయాల్లో కూడా పుణ్యక్షేత్రాల్లో తలనీలాలను అర్పించే ఆచారం అనాదిగా వస్తూనే ఉంది. దైవానికి ఆ కురులు కావాలని కాదుగానీ, కురులకున్న ప్రత్యేకమైన గుణాలను జీవితంలో సాధన చేసన్నా, ఆ దైవసన్నిధిలో పవిత్రమైన హృదయంతో కనిపించాలనేదే దాని అంతరార్థం. అది అర్థం చేసుకునే వారెవరైనా ప్రభుని సన్నిధిలోనికే చేరతారనేది నా తాత్పర్యం. మరి అంత పవిత్రమైన ఆలోచనలతోనూ, ప్రశస్తమైన ఆచరణలతోనూ, ఆత్మీయతతోనూ, ఆధ్యాత్మికతతోనూ ప్రభుని చరణాలను చేరితే అదే మన విజయరహస్యం! మన ప్రశంశా పత్రం.

## ఈ మాసపు పాట

- ఆచార్య ఆరోన్

**చూపరానిది**
**చెప్పలేనిది**
**అనుభవించి తెలుసుకో**
**ఆనంద తత్వమిది**

**వేదాంతము కానిది**
**రాద్ధాంతము లేనిది**
**సిద్ధాంత గ్రస్తులకు**
**సిద్ధించని లక్ష్యమిది**

**విశ్వాస ప్రాతిపదిక**
**శాశ్వత విలువల కలయిక**
**రక్షణాభ్యుదయ వేదిక**
**అక్షయ రాజ్యానికి చేరిక**

**యేసువార్త దివ్య వార్త**
**శుభవార్త అభయ వార్త**
**వినుమా నిత్యజీవమును గనుమా**

**• సెప్టెంబర్ గ.ను.క జవాబులు •**

**అడ్డం ▪**

1. నూనెగానుగల 4.స్వకీయ 5.రూతు (తలక్రిందులు) 6.బబులోను 7.పరుని 9.జనము 10.రాము 13.బొరియలు 14.మరణ 15.మాడ్చి 16.మరవడు 17.యుక్తి 18.క్రొత్త 19.వీధి

**నిలువు ▪**

1.నూరు 2.గారాబము 3.గడ్డిలో 4.స్వరూపము 8.నిప్పుకణములు 9.జగడమాడడు 10.రాజు 11.పరిచారము 12.విలుకాడు 14.మహాశక్తి 17.యుద్ధ

## బాలస్పందన

# భలే బొంగరం



**సుమతి**పాలెం అనే ఒక ఊరు ఉంది. ఆ ఊరు నదీతీరాన్ని ఆనుకుని ఉంది. ఆ ఊరిలోని కుటుంబాలన్ని ఆ నదిలో చేపల వేటకు వెళ్ళి జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటారు.

ఈ ఊరిలోనే ఒక చిన్న గుడిసెలో ఒక వృద్ధ దంపతులు నివాసం చేస్తున్నారు. వారితో కూడా వారి మనుమడు కూడా ఆ గుడెసెలోనే ఉంటాడు. వీరు కూడా కొద్దో గొప్పో చేపలను పట్టి తెచ్చి వాటిని అమ్మి రోజులు వెళ్ళబుచ్చుతూ ఉండేవారు. అయితే ముసలాయనకు రాను రాను వేటకు వెళ్ళడానికి ఆరోగ్యం సహకరించడంలేదు. కొద్దిరోజులకు ఆరోగ్యం క్షీణించి తనతో మనుమడను కూడా వెంట తీసుకొని వెళ్ళడం మొదలుపెట్టాడు. అలా మనుమడకు కూడా చేపలు పట్టడం నేర్పించాడు.

వాడికీ వల విసరడం చేపలు పట్టడం కొద్దికొద్దిగా అలవాటయింది. అప్పుడప్పుడూ మనుమడ్నే ఒంటరిగా చేపలు పట్టడానికి పంపించేవాడు.

మరికొన్నిరోజులకు ముసలాయనకు ఆరోగ్యం బాగోక ఇంట్లోనే పడుకున్నాడు. తినడానికి కూడా కష్టమైపోతుంది. ముసలమ్మ "చేపలు పట్టే మనం చేపలు తిని చాలా రోజలయిపోయింది. నాలుక సప్పగా అయ్యింది'' అని అనుకుంటుంది. ముసలాయనకు కూడా రోజు ఆ గంజే తాగి నాలుక చప్పనయింది. తన మనమడును పిలిచి "అరే మనవడా! నదిలోకి మరీ లోతుకు వెళ్ళకుండా వలవేసి ఏదైనా చేపలు పట్టుకుని వస్తావట్రా?" అని అడిగాడు. "అలాగే తాత! జాగ్రత్తగా వెళ్ళి నేను చేపలు పట్టి తీసుకు వస్తాలే" అని చెప్పి బుట్ట మొలకు కట్టుకొని వల భుజాన వేసికొని నది వైపుబయల్దేరాడు.

నదిలో వల విసరగానే తస్సాదియ్యా చేపలు పడలేదుగాని క్రొత్త రంగురంగుల బొంగరం పడింది. అది చూడగానే మనోడికి "భలే వుందిలే ఈ బొంగరం" అని దాన్ని వలలోనుండి తీసాడు. దానితో ఆడుకోవాలనిపించింది. దూరంగా చెట్టు క్రింద పిల్లలు ఆడుకొంటున్నారు. వారితో

కలిసి వెళ్ళి ఆడుకుందామని అనుకొన్నాడు. వెంటనే అయ్యే బొంగరం అయితే ఉంది కాని దానికి తాడు లేదు కదా! ఎలాగా! అని ఆలోచించాడు. అయితే బొంగరానికి తాడులేదు. తన మొలతాడు చాలదు. భలే ఉపాయం తట్టింది. వలకు మంచి త్రాళ్ళున్నాయ్. మరికనేం! ఒకటి కష్టంమీద తెంపి ఆ బొంగరానికి చుట్టాడు. ఇక ఒడ్డున ఉన్న ఆ చెట్టుకిందకు వెళ్ళి అక్కడున్న ఆకతాయిలతో ఆటల్లో పడ్డాడు అబ్బాయి. బొంగరం ఆట భలే ఉంది అనుకుంటూ సమయం కూడా తెలియకుండా ఆడుతూ ఉండిపోయాడు.

ఇక యింటి వద్ద కధవినండి. ముసలాళ్ళిద్దరు, పిల్లాడు వస్తాడు చేపల పులుసు వండుకుని తిందాం అంటూ కళ్ళు చిల్లులు పడేలా దారికాచారు గంపెడాశతో. ముసలమ్మ కూరకు కావలిసినవన్నీ సిద్ధంచేసి మరి ఎదురు చూస్తోంది. వాడు వస్తేనా! ఎంత చూచినా పిల్లోడూ లేదు పిల్ల చేప లేదు. ఒక్కసారే చేపలకూరతో తినేద్దాం అంటూ ఆకలితో చూస్తున్నారు పాపం ముసలోళ్లు.

ఇక చాలాసేపయింది అసలు పసి పిల్లోడు ఏమయ్యాడో అని భయం వేసింది వారికి. నిదానంగా ముసలాయన కర్ర సాయంతో దారినపడ్డాడు. ఎదురైన వారినందరిని మా మనమడేమైనా కనబడ్డాడా! అంటూ అడుగుతూ వెళుతున్నాడు. చూడలేదంటే చూడలేదని చెప్పారు. అలాగే నది దగ్గరకు వచ్చేటప్పటికి అదిగో! చెట్టుకింద అబ్బాయి ఆటల్లో మునిగిపోయి, పెద్ద పెద్ద కేకలేస్తూ మురిసిపోతున్నాడు. దగ్గరకు వెళ్ళాడు. "ఏరా" అన్నాడు ముసలాయన. అంతే వాడికి తాతను చూసేసరికి బొంగరం జారింది. ఇక ఏముంది తాతను చూస్తే వాడికి, వాడ్ని చూస్తే తాతకు ఎల్లా వుందని చెప్పను.

మనల్ని తన వలలో వేసుకోడానికి సాతాను దగ్గర త్రాగుడు,జూదం, సినిమాలు, సిగరెట్లు, చెడ్డాళ్ళ స్నేహం లక్షాతొంభై బొంగరాలున్నాయ్.


ఇప్పుడు నీవు వాడుచున్న బొంగరం ఏమిటో కాస్త ఆలోచించు.

ఏమో, వాడికి నాల్గు చీవాట్లు, దెబ్బలే తగిలాయ్ గాని మన బొంగరం మనల్ని నిత్యనరకానికే తీసుకు వెళ్తుందేమో.

## నా కదే సంతోషం

*చీకటి నా పైని నల్లగా కురుస్తుంది*
*ఆత్మ దీపం చుట్టూ భీతి*
*కేకలేస్తూ తిరుగుతోంది*
*సమస్యలు సుడిగాలులై నన్ను*
*నాలో రెప రెప లాడిస్తున్నాయి*
*కన్నులు ఎర్ర గోళీలై*
*లోపలెక్కడో దాక్కున్నాయి*
*అయినా నా స్వామీ! క్రీస్తూ*
*నా విశ్వాసపు తీగలు*
*నిన్నల్లుకు పోతున్నాయి*
*నా కదే సంతోషం*
*అశక్తతత ఆవరించి పూలగుండె*
*శోధనా అడకత్తెరలో*
*నెత్తురు బొట్లు చిందుతున్నా*
*నా విశ్వాసపు తీగలు*
*నిన్నల్లుకు పోతున్నాయి*
*నాకదే సంతోషం*
*నీ కరుణామయ కరకమలాలకు తెలుసు*
*నన్నెలా ఆదుకోవాలో*
*అరివీర భయంకరమైన*
*నీ దక్షిణ హస్తానికి తెలుసు*
*నన్నెలా కాపాడాలో*
*నీపైని నిరీక్షణం*
*నాకు కొత్త బలం యిస్తుంది.*
*ఉత్తేజపు కాంతిని*
*హృదయంలోనికి ఇంజెక్టు చేస్తూ*
*నా స్వామీ క్రీస్తూ!*
*నా విశ్వాసపు తీగలు*
*నిన్నల్లుకు పోతున్నాయి*
*నా కదే సంతోషం.*

– డా॥ కొండెపోగు బి.డేవిడ్ లివింగ్స్టన్




# బైబిల్‌లోని పేర్లు వాటి అర్థాలు

**ఆమోను** = నిర్భయము లేదా నమ్మకస్థుడు.
(1) ఆహాబు కాలమందు షోమ్రోను పట్టణమునకధిపతి.
1 రాజు 22:26; 2దిన 18:25
(2) మనష్షే కుమారుడైన యూదా రాజు.
2 రాజు 21:18,23,24,25; 1 దిన 3:14; 2 దిన 33:20,21, 23,25; యిర్మీ1:2; 25:3; జెఫ 1:1; మత్త 1:10
(3) అమి అను మారుపేరు గలవాడు. నెహె 7:29

**ఆమోసు** = భారము లేదా బరువులు మోయువాడు. బైబిలులోని ప్రవచన గ్రంథకర్త.
ఆమో 1:1; 7:8,10,12,14; 8:2

**ఆయాతు** = కుప్ప లేదా శిధిలమైన స్థలము – యెష 10:28

**ఆరమోజబాయీయులు** = రాజైన దావీదు శత్రువులలో ఒక జాతివారు – కీర్త 60:శీర్షిక

**ఆరహు** = దేశదిమ్మరి, బాటసారి.
(1) ఆషేరు వంశస్థులలో ఒకడు
1దిన 7:39
(2) ఎజ్రా కాలమందు యెరూషలేమునకు తిరిగివచ్చిన యూదులలో కొందరికి పితరుడు.
ఎజ్రా 2:5; నెహె 7:10
(3) అమ్మోనీయుడైన టోబియా భార్య యొక్క తాత – నెహె 6:18

**ఆరాబు** = ఆవరణము. యూదయ కొండల ప్రదేశమందు హెబ్రోను దగ్గరనున్న ఒక పట్టణము – యెహో 15:48–54

**ఆర్దీయులు** = ఆర్దు వంశస్థులు – సంఖ్యా 26:39:40

**ఆరు** = పురము లేదా మేలుకొనుట. మోయాబు రాజధాని
సంఖ్యా 21:14,15,28; ద్వితీ 2:9,17,29; యెష 15:1 (ఆర్మోయాబు)

**ఆర్దు** = లొంగదీయుట లేదా సంతానము.
(1) బెన్యామీను కుమారులలో ఒకడు – ఆది 46:21
(2) బెన్యామీను మనుమలలో ఒకడు – సంఖ్యా 26:39,40

**ఆరోదీ, ఆరోదు** = సంతానము. గాదు కుమారులలో ఒకడు
– ఆది 46:16; సంఖ్యా 26:17

**ఆలూషు** = మానవుల అల్లరి లేదా అడవి ప్రదేశము. సీనాయి దగ్గరకు వెళ్తూ ఇశ్రాయేలీయులు ఆగిన మకాములలో ఒకటి.
సంఖ్యా 33:13,14

**ఆలెఫ్** = హెబ్రీ అక్షరములలో మొదటిది – కీర్త 119 : మొదటి భాగము

**ఆలెమెతు** = కప్పు, దాగుచోటు. రాజైన సౌలు కుమారుడగు యోనాతాను వంశస్థులలో ఒకడు.
1 దిన 7:8;8:36; 9:42

**ఆలోతు** = పాలిచ్చెడిది. ఆషేరు గోత్రస్థానము దగ్గరనున్న ఒక కొండప్రదేశము – 1 రాజు 4:16

**ఆవీము** = బేతేలు సమీపమున బెన్యామీను గోత్రస్వాస్థ్యమందలి ఒక పట్టణము – యెహో 18:22

**ఆవీయులు** = గ్రామస్థులు.
(1) మోషేకాలమునకు ముందు నశించిన ఒక జాతివారు.
ద్వితీ 2:23; యెహో 13:4
(2) షోమ్రోను పట్టణమునకు కొనిపోబడిన ఒక జాతివారు.
2 రాజు 17:31

**ఆవెను** = చెరువు లేదా శూన్యము. ఐగుప్తు దేశమందలి ఒక పట్టణము – హోషే 10:8; ఆమో 1:5

**ఆషాను** = పొగ. యూదాగోత్రస్థానమందుండి తరువాత షిమ్యోను గోత్రమునకు ఇయ్యబడిన ఒక పట్టణము.
యెహో 15:42–47; 19:7; 1 దిన 4:32; 6:59

**ఆష్తెరాతీయుడు** = దావీదు పరాక్రమశాలులలో ఉజ్జీయా అనువాని జాతీయుడు.
1 దిన 11:44

**ఆషేరాయులు** = ఆషేరు వంశస్థులు – సంఖ్యా 7:72; 10:26; 26:47; 34:27; యెహో 17:10,11; 19:24,31; న్యాయా 1:31,32; 5:17; 1 దిన 7:30; 12:36; యెహె 48:2,3

**గమనిక** – ఈ వాక్య భాగాలు మీ బైబిలులో పెన్సిలుతో గుర్తించండి. అర్థాలు రాసుకోండి. వాక్యాన్ని మరింకా బాగా అర్థం చేసుకోవటానికి సాయపడతాయి.



## రేడియో పాఠం

ఆచార్య ఆరార్కే

# నిర్గమ కాండము



(గత సంచిక తరువాయి)

**నిర్గమ-20 అధ్యాయము**

సోదరీ సోదరులారా ! కంటికి కన్ను, పంటికి పన్ను అనే విధానం న్యాయాధిపతులకు ధర్మశాస్త్రమే అప్పగించింది. అంతేకాని, ఈ పని వ్యక్తులు చేయవలసింది కాదు. వ్యక్తిగత సంబంధాలలో మనుష్యులు ఈ అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. న్యాయస్థానంలో న్యాయాధిపతి అవలంబించిన శిక్షా విధానం ఇదే. అనేక దేశాలలో నేరానికి విధించబడే శిక్ష బహు క్రూరమైనది. కాని బైబిలులోని ధర్మశాస్త్ర విధానం మానవ శ్రేయస్సు దృష్ట్యా ఎంతో ప్రయోజనకరమైంది. యేసుప్రభువు మత్తయి సువార్త 5:38-48 వరకు ధర్మశాస్త్రాన్ని ఇంకా ముందుకు తీసుక వెళ్ళాడు. ఒక తండ్రి గాని, ఒక న్యాయాధిపతిగాని, పిల్లలు ముద్దాయిలు అయితే ఎలా వ్యవహరించాలో, ఎలాంటి చర్య తీసుకోవాలో ధర్మశాస్త్రం స్పష్టంగా చూపుతోంది. అన్యాయంగా దుర్భరమైన శిక్ష విధించకూడదు. గొప్ప నేరాన్ని కొద్దిపాటి శిక్షతో విడువకూడదు. ఈ విషయంలో తీర్పు చెప్పేటప్పుడు న్యాయాధిపతులకు దేవుడే జ్ఞానం ప్రసాదించాలి. ఇప్పుడు కొండ మీది ప్రసంగంలో ప్రభువు ఏమంటున్నాడో వినండి. మత్తయి 5:38 నుండి కంటికి కన్ను, పంటికి పన్ను అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా ! నేను మీతో చెప్పునదేమనగా దుష్టుణ్ని ఎదిరింపక నిన్ను ఎడమ చెంపమీద కొట్టిన వారికి నీ కుడిచెంపకూడ తిప్పు ఎవడైన నీ మీద వ్యాజ్యం వేసి నీ అంగీ తీసుకొన గోరిన యెడల వానికి నీ పై వస్త్రం కూడ ఇచ్చివేయి. ఒకడు ఒకమైలు దూరం రమ్మని నిన్ను బలవంతం చేసిన యెడల వానితో కూడ రెండు మైళ్ళు వెళ్ళు. నిన్ను అడిగే వానికి ఇయ్యి. నిన్ను అప్పు అడుగగోరే వాని నుండి నీ ముఖం తిప్పుకోవద్దు. నీ పొరుగువాణ్ని ప్రేమించి నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా ! నేను మీతో చెప్పునదేమనగా మీరు పరలోక మందున్న మీ తండ్రికి కుమారులై ఉండేటట్లు మీ శత్రువులను ప్రేమించండి. మిమ్మును హింసించేవారి కోసం ప్రార్థన చేయండి. ఆయన చెడ్డవారి మీద మంచి వారి మీద తన సూర్యుణ్ని ఉదయింపచేసి, నీతిమంతుల మీద, నీతి హీనుల మీద వర్షం

కురిపిస్తున్నాడు. మీరు మిమ్మును ప్రేమించే వారినే ప్రేమిస్తే, మీకేమి ఫలం కలుగుతుంది. సుంకరులు కూడ అలాగే చేస్తున్నారు గదా ! మీ సహోదరులకు మాత్రమే వందనం చేస్తే, మీరు ఎక్కువ చేస్తున్నదేమిటి? అన్యజనులు కూడ ఆలాగే చేస్తున్నారు గదా? మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు. గనుక మీరును పరిపూర్ణులుగా ఉండాలి. చూచారా! యేసు ప్రభువు తన శిష్యుల ద్వారా ధర్మ శాస్త్రాన్ని మించి చేయిస్తానంటున్నాడు.

దేవుని ఉద్దేశ్యం ప్రజలను బాధపెట్టాలని కాదు. దేవుడు కనికరమును కోరుతున్నాడు. న్యాయాధిపతులకు దేవుడు చెప్తున్నాడు. నేరానికి తగినట్లు శిక్ష ఉండాలి. ఇది కక్ష సాధింపు చర్యకాదు. ప్రతీకార భావనతో మనుష్యులు ఒకరినొకరు చంపుకోవటం దేవునికి ఇష్టం లేదు. కంటికి కన్ను, పంటికి పన్ను అని ప్రతి ఒకడు కక్ష సాధింపు చర్యకు పూనుకుంటే సమాజమంతా నాశనమై పోతుంది. నాటి నుండి నేటి వరకు చిన్న పిల్లలు సహితం ఇదే మాట అంటారు. వాడు నన్ను కొట్టాడు. నేను అతణ్ని కొట్టాను. ఆమె నన్ను తిట్టింది. నేను ఆమెను తిట్టాను. దెబ్బకు దెబ్బ. గానీ ఇది యేసుప్రభువు విధానం కానేకాదు. మనకు కీడు జరిగినప్పుడు వెంటనే మనపాత స్వభావం ప్రతీకారం చేయాలని చెప్తుంది. కానీ ప్రభువు అంటున్నాడు. మనకు కీడు చేసిన వారికి మనం మేలు చేయాలి. ప్రేమించటం, క్షమించటం అనే రెండు సుగుణాలు దేవుని బిడ్డలకు చెందినవి. ఇవి సహజలక్షణాలు కావు. ఇవి సహజాతీత లక్షణాలు. యేసు ప్రభువు ప్రేమించినట్లు మనం ప్రేమించాలంటే దేవుడే సహాయం చేయాలి. ప్రతీకారానికి ప్రయత్నించకుండ మనకు కీడు చేసిన వారికోసం ప్రార్ధన చేయాలి. యేసు ప్రభువు కొండ మీద చేసిన ప్రసంగంలో ఈ మాటలు పలికినప్పుడు యూదులకు అభ్యంతరమనిపించింది. మెస్సీయా బలహీనుడా? ఈ చెంపకొడితే ఆ చెంప చూపుతాడా? అతడు ఎలాంటి నాయకుడు? రోమా ప్రభుత్వాన్ని ప్రతిఘటించి నాశనం చేసేటంత బలం ఉండాలి. లేకపోతే అతడు ఎలా మెస్సీయా అవుతాడు. యూదులు రోమా ప్రభుత్వాన్ని ద్వేషించారు. వారిని తమ శత్రువులుగా భావించారు. వారి కౄర పరిపాలనను నిరసించారు. ఎదురు తిరిగారు. కానీ యేసు ప్రభువు ఒక కొత్త ఫంథా చూపుతున్నాడు. అన్యాయాన్ని ఎలా ఎదుర్కోవాలో, సాత్వీకం ఎంత బలమైనదో చూపుతున్నాడు. మన హక్కులు కోసం పోరాటం కాదు. స్వచ్ఛందంగా మన హక్కులను వదులుకోవాలి. మనమే న్యాయమును కనికరమును చూపాలి. అది ఇతరుల నుండి రావాలని చూడకూడదు.

ఎదురు దెబ్బతీసే ప్రయత్నం మంచిది కాదు. తీర్పు తీర్చే అధికారం వ్యక్తిగతంగా ఏ ఒక్కరికి లేదు. అది న్యాయస్థానం చేయవలసినపని మనం మన పట్ల నేరం చేసిన వారి కోసం ప్రార్థిస్తే చెడుగును మంచితో గెలిచిన వారమౌతాము.

లేవికాండం 19:18 కీడుకు ప్రతికీడు చేయకూడదు. నీ ప్రజల మీద కోపం ఉంచుకొనక నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించాలి అన్నాడు దేవుడు. దీనికి అలనాటి పరిసయ్యులు విపరీతమైన అర్థం చెప్పారు. మనలను ప్రేమించే వారినే మనం ప్రేమించాలి అన్నారు. వారింకా ఏమి చేశారంటే కీర్తనలు 139:19-22 వరకు కీర్తనలు 140:9-11 వరకు తమ అభిప్రాయాన్ని సమర్థించుకోటానికి ఉదహరించారు. అంటే దావీదు మాటల్లో "దేవా నీవు భక్తి హీనులను నిశ్చయముగా సంహరిస్తావు. నరహంతకులు, దురాలోచనతో నిన్ను గూర్చి పలుకుతారు. నీ నామమును బట్టి ప్రమాణం చేస్తూ, మోసగిస్తారు. యెహోవా, నిన్ను ద్వేషించే వారిని నేను ద్వేషిస్తున్నాను గదా ! నీ మీద లేచేవారిని నేను అసహ్యించుకుంటున్నాను గదా ! వారియందు నాకు పూర్ణద్వేషం ఉన్నది వారిని నాకు శత్రువులనుగా భావించుకొంటున్నాను. నన్ను చుట్టకొనే వారు తల ఎత్తిన ఎడల వారి పెదవుల చేటు వారిని ముంచును గాక ! కణకణలాడే నిప్పులు వారి మీద వేయబడును గాక. అగ్ని గుండంలో వారు కూల్చబడి తిరిగి లేవకుందురు గాక ! అగాధ జలములలోనికి త్రోయబడుదురు గాక ! కొండెములాడేవారు భూమి మీద స్థిరపడకుందురు గాక ! ఆపత్తు బలాత్కారులను తరిమి వారిని పడత్రోయును గాక ! ఈవిధంగా తమ వైఖరిని సమర్ధించుకొన్నారు.

(మిగతా వచ్చే సంచికలో)

# వివాహవేదిక

## వరుని కోసం...

1) 32 సం॥రాల వయస్సు 5'5" అడుగుల ఎత్తు కలిగి M.C.A చేసి హైదరబాదులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న విశ్వాసియైన యువతికి 34-37 సం॥వయస్సు, 5'7 ఎత్తు, మంచి చదువు కలిగి ఏదైనా ఉద్యోగము చేస్తున్న విశ్వాసియైన వరుడు కావలెను. **(SVV-M-266)**

2) 29 సం॥రాల వయస్సు 5'3" అడుగుల ఎత్తు కలిగి (M.A)B.Sc, B.ed చేసి టీచర్‌గా చేస్తున్న విశ్వాసియైన యువతికి 30-35 సం॥ల లోపు వయస్సు, మంచి చదువు కలిగి ఏదైనా ఉద్యోగం చేస్తున్న విశ్వాసియైన వరుడు కావలెను. **(SVV-M-267)**

3) 38 సం॥రాల వయస్సు 5'3" అడుగుల ఎత్తు కలిగి M.A చేసి విజయవాడలో ప్రైవేటు స్కూల్ టీచర్‌గా చేస్తున్న విశ్వాసియైన యువతికి సేవ చేస్తున్న లేదా సేవ పట్ల ఆసక్తి గల విశ్వాసియైన వరుడు కావలెను. సంప్ర. నం. 9290538233 **(SVV-M-268)**

### సెప్టెంబర్ గ.ను.క ఆల్ కరెక్టు వ్రాసినవారి పేర్లు


కె.విజయం-తెనాలి, జేన్ఆనంద్-డోన్, బి.చంద్రలీల-మదనపల్లి, డి.డి.డి.ఎ.మణి-విశాఖపట్నం, వి.యం.ప్రభావతి-హైదరాబాదు, బి.ఏలీషారావు-గుడివాడ, బి.సరోజని-గుంతకల్లు, యస్.జోనాతన్-ఒంగోలు, యన్.యస్.యస్.పాల్-భీమవరం, యం.నిర్మలసుదీప్‌రెడ్డి-కొండపల్లి, బి.మణిజయప్రకాష్-అమ్మిరెడ్డిగూడెం, బి.నాగమణి-గంపలగూడెం, యం.రత్నకుమారి-అమ్మిరెడ్డిగూడెం, సి.హెచ్.కస్తూరిబాయి-చీరల, పి.దేవదానం-నంద్యాల, కె.భారతిదేవప్రియం-కడప, యమ్.రాజమ్మ-కడప, జె.శ్యామల-గుంటూరు, జి.కె.యల్.సుగుణమ్మ-బద్వేల్, జి.రిబ్కమ్మ-కలసపాడు, ఎ.మునిరాజు-కడప, జి.పాల్-కలసపాడు, దేవకుటుంబరావుసరోజని-విశాఖపట్నం, బి.యన్.హేమలతాపాల్-మదనపల్లి, ఎ.కె.జయమ్మ-అనంతపురం, జి.సుధాకమల-భీమవరం, యస్.రూతుఆమోసు-కనిగిరి, వి.యల్.ప్రసూనాంబ-గుంటుపల్లి, బి.అనీమేరి-హైదరాబాదు, దీనమ్మక్రిష్టోఫర్-హన్మకొండ, యం.సంపతీబెన్నికుమార్-వడియారం, యస్.దేవమణి-ఎమ్మిగనూరు, మార్తాయేసుదాస్-జమ్మలమడుగు, టి.యం.సుగుణ-శ్యాంపేట, పి.జెర్మియా-పెదపులిపాక, ఆర్.జయమ్మలాబాను-గుంతకల్లు, బి.కెంపురత్నకుమారి-వరంగల్, జె.సరోజని-రాజమండ్రి, యస్.మాథ్యూస్-ఒంగోలు, కె.జె.మార్గరెట్‌పద్మాకర్-గుత్తి, వి.మోజస్‌నిషాంత్-గుత్తి, యమ్.మేరీ-కె.కోటపాడు, టి.శోభారాణి-హన్మకొండ, వి.భాగ్యలక్ష్మి-విశాఖపట్నం, బి.శాంతకుమారి-కడప, టి.శాంతరత్నం-ఏలూరు, జి.శారాసుగుణ-జమ్మలమడుగు, యన్.సత్యనారాయణ-విశాఖపట్నం, రావిఆదిత్య-మోదుకూరు, జి.పి.మేరీప్రమీల-హిందూపూర్, ఆర్.సుహృలత-విజయవాడ, బి.ఆశీర్వాదం-పిఠాపురం, పి.గ్రేషియస్-పెదవేగి, వై.మాణిక్యం-కంచికచర్ల, ఆర్.యమ్.విజయకుమారి-మదనపల్లి, యన్.బి.ప్రభావతి-బేస్తవారిపేట, యస్.మెర్సిలారెన్స్-కాకినాడ, హెచ్.సరళమ్మ-గిద్దలూరు, జె.ప్రసాదరావు-రంపయర్రపాలెం, జి.ఎస్తేరు-అచ్చంపేట

**ఒకతప్పుతో వ్రాసినవారు:** సి.సశీలమ్మ-కర్నూలు, కె.స్తోత్రవాణి-చీరాల, జి.భారతిఆండ్రూస్-చింతకుంట, వి.కమల-చిలమకూరు, యం.సి.మనోహరమ్మ-అనంతపురం, బి.ఐజయ్య-జమ్మలమడుగు, యు.యన్.పురుషోత్తం-ప్రొద్దుటూరు, రమణయ్యసోమయ్య-అనంతపురం, కె.విమల-హైదరబాదు, యన్.శాంతిశ్రీ-నిమ్మకూరు, పి.హిల్డామార్గరెట్-నెల్లూరు, ఎ.శారాప్రభావతి-గుంతకల్లు, జి.స్వర్ణలతసుందరం-కడప, టి.సువర్ణమ్మ-కడప.



ఆచార్య ఆరార్కే

# ప్రకటన గ్రంధ
## పరమ సత్యాలు



సింహాసనాసీనుడైన మహిమగల ప్రభువు

### ఉపోద్ఘాతము

(గత సంచిక తరువాయి)

పాఠకులూ గ్రహించండి. ప్రకటన గ్రంధం గ్రహించడానికి కఠినమైన పుస్తకమేమి కాదు. బైబిలు గ్రంధాలన్నిటిలోకి ప్రకటన గ్రందం ఒక క్రమబద్ధమైన గొప్ప గ్రంధం. ప్రకటన 1:19,20 **"నీవు చూచినవాటిని, ఉన్నవాటిని, వీటివెంట కలుగబోయేవాటిని వ్రాయి."** భూత, వర్తమాన, భవిష్యత్తులలోని సంగతులను యేసుప్రభువు చెబుతుంటే యోహాను వ్రాసాడు. సంఘటనలన్ని ఒక నిర్ధిష్టమైన క్రమం చొప్పున గ్రధస్తం చేయబడ్డాయి. అంశాలను ఈ విధంగా క్రమబద్ధంగా రూపొందించిన గ్రంధం ఇదొక్కటే బైబిలులో మనకు అనుగ్రహించబడింది. వాస్తవాన్ని బోధపరచడానికి యోహాను కొన్ని సంకేతాలను అడపాదడపా ప్రయోగించాడు. ప్రకటన గ్రంధాన్ని, తాను చెప్పదలంచిన దాన్ని ఉన్నది ఉన్నట్లు చెప్పనీయండి. దేవుని వాక్యం సజీవమైనది. అది మాట్లాడే వాక్యం. జరగబోయేవాటిని జరిగినట్లు, జరుగుతున్నట్లు చెప్పకూడదు. యోహాను కాలంలో యేడు సంఘాలున్నాయి. అవి వాస్తవ సంఘాలు. ఈ యేడు సంఘాలకు ఉత్తరాలు వ్రాయబడ్డాయి. ఈ ఉత్తరాలు ఆధారంగా సంఘచరిత్రలోని వివిధ దశలను గుర్తించగలం. ప్రకటన గ్రంధమంతా చరిత్ర చిత్రపటాలు. మూడో అధ్యాయం దాటితే సంఘం ఊసే ఉండదు. సంఘం పరలోకానికి ఎత్తబడిన తరువాత జరిగే సంఘటనలు నాలుగో అధ్యాయం నుండి వ్రాయబడినవి. పరలోకానికి ఎత్తబడిన సంఘం యేసుక్రీస్తు యొక్క వధువు. ప్రకటన గ్రంధమంతా వింటూ ఉండగా యేసుక్రీస్తు యొక్క వధువైన సంఘం ఎలా ఉంటుందో, ఎలా తన భర్తతో, కర్తతో ప్రవర్తిస్తుందో తేటగా చూడగలం. ప్రకటన నాలుగో అధ్యాయం మొదలుకొని అంతా భవిష్యత్తులో జరగబోయే సంఘటనలే చెప్పబడ్డాయి. వర్తమాన కాలానికి చెందిన వర్తమానం కాదిది. ప్రవచనం అని మనం జ్ఞాపకముంచుకోవాలి. దేవుని సంఘం దేవుని వాక్యాన్ని వివిధ దృక్కోణాలలో వివరిస్తూ వస్తుంది. ఒక్కొక్క తరానికి ఒక్కొ ప్రత్యేకమైన దృక్పధాన్ని సంఘం పెంపొందించుకున్నట్లు కన్పిస్తుంది. లేఖనం దేవుని వాక్యమని, యేసుక్రీస్తు

వ్యక్తిత్వం, రక్షణ ఈ విధంగా వివిధ సిద్ధాంతాలను పరిశోధనాత్మకంగా సంఘం వెలువరిస్తున్నది. ఇప్పుడైతే ఎక్కువ ప్రవచనాలవైపు సంఘం దృష్టి మొగ్గు చూపుతుంది. ఏది ఏమైనా దేవుని వాక్యాన్ని సరిగా, సవ్యంగా విభజించి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కడవరి దినాలలో జరిగే సంగతులను గురించి ఈ రోజున క్రైస్తవ విశ్వాసులు ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఏమైనా దేవుని వాక్యానికి సరైన వివరణ, వ్యాఖ్యానం అత్యవసరం. రెండో ప్రపంచ యుద్ధం ముగిసినప్పటినుండి ప్రకటన గ్రంథం ప్రజల దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తోంది. ప్రకటన గ్రంథం సులభగ్రాహ్యమైన కొన్ని ప్రకటన గ్రంథ వ్యాఖ్యానాలు కఠినాతి కఠినంగా ఉన్నాయి. జ్ఞాపకముంచుకోండి. 1వ అధ్యాయం ఉపోద్ఘాతం, 2.3 అధ్యాయాలు సంఘం, 4.5 అధ్యాయాలు సంఘం ఎత్తబడడం, 6 నుండి 18వ అధ్యాయం వరకు మహాశ్రమలు, 19నుండి 20వ అధ్యాయం వరకు వెయ్యేండ్ల పాలన కాలం, తరువాత ధవళసింహాసనం తీర్పు, 21,22 అధ్యాయాలు నిత్యత్వం. ఆమేన్!

**ఉపోద్ఘాతము ఇంతటితో ముగించబడింది.**
**ఇక ప్రకటన గ్రంథ పరమ సత్యాలను మొదటి అధ్యాయం నుండి ధ్యానిద్దాం.**

### ప్రకటన 1:1-6

యేసుక్రీస్తు తన దాసులకు కనపరచడానికి దేవుడు ఆయనకు అనుగ్రహించిన ప్రత్యక్షత. ఈ సంగతులు త్వరలో సంభవించ నైయున్నవి. ఆయన దూత ద్వారా వర్తమానం పంపి తన దాసుడైన యోహానుకు వాటిని సూచించాడు. అతడు దేవుని వాక్యమును గూర్చి, యేసుక్రీస్తు సాక్ష్యమును గూర్చి తాను చూచినంతమట్టుకు సాక్ష్యమిచ్చాడు. సమయం సమీపించినది గనుక ఈ ప్రవచనవాక్యములు చదివేవాడు, వాటిని విని ఇందులో వ్రాయబడిన సంగతులు గైకొనేవారు ధన్యులు. యోహాను ఆసియాలో ఉన్న 7 సంఘములకు శుభమని చెప్పి వ్రాయునది. వర్తమాన, భూత, భవిష్యత్తు కాలములలో ఉన్నవాని నుండి, ఆయన సింహాసనం ఎదుట ఉన్న ఏడు ఆత్మలనుండి, నమ్మకమైన సాక్షి, మృతులలోనుండి ఆది సంభూతుడుగా లేచి భూపతులకు అధిపతి అయిన యేసుక్రీస్తునుండి, కృపాసమాధానములు మీకు కలుగును గాక!

మనలను ప్రేమిస్తూ తన రక్తమువలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు, ప్రభావమును యుగ యుగములకు కలుగును గాక! ఆమేన్! ఆయన మనలను తన తండ్రియైన దేవునికి ఒక రాజ్యముగాను, యాజకు లనుగాను చేశాడు. ఇదిగో ఆయన మేఘారూఢుడై వస్తున్నాడు. ప్రతి నేత్రము ఆయనను చూస్తుంది. ఆయనను పొడిచినవారు చూస్తారు. భూజనులందరూ ఆయనను చూచి రొమ్ము కొట్టుకుంటారు. అవును. ఆమేన్!

డొమేషియన్ చక్రవర్తి సంఘమును ఎదిరించిన వారిలో మొదటివాడు. సంఘం పక్షాన చక్రవర్తులను ఎదురించిన అపొస్తలు లలో చిట్టచివరివాడు యోహాను. నీరో కాలంలో పౌలు, పేతురు హతసాక్ష్యులయ్యారు. క్రైస్తవ ఉద్యమం వెనుక యేసుక్రీస్తు ఉన్నాడని చక్రవర్తుల మహిమ మట్టికరుస్తుందని చక్రవర్తి గ్రహించాడు. యేసే విశ్వవిజేత అనడానికి ఇది ఛాయా సంకేతం. ప్రకటన గ్రంథారంభంలో యేసుక్రీస్తు మనకు సాక్ష్యాత్కరిస్తున్నాడు, మహిమలోని క్రీస్తు మనకు కన్పిస్తున్నాడు. ఆయన ప్రధాన యాజకుడు. సంఘం ఆయన వశంలో, ఆయన స్వాధీనంలో ఉంది. సువార్తలలో యేసుక్రీస్తు సాత్వికుడు, దీనమనస్కుడు. ఆయన సిలువపై వ్రేలాడాడు. శత్రువులకు తనను తానే అప్పగించుకున్నాడు. కాని ప్రకటన గ్రంథంలో యేసుక్రీస్తు మనకు వేరే విధంగా ప్రత్యక్షమవుతున్నాడు. ఆయన గొర్రెపిల్లే గాని ఇక్కడ గొర్రెపిల్ల మహోగ్రత ఎంత తీవ్రంగా కనపడుతుందో చూడండి. గొర్రెపిల్ల రౌద్రానికి తాళగలిగినవారెవరు? బైబిలంతా కలిపి యేసుపుస్తకం అని చెప్పవచ్చు.

(మిగతా వచ్చే సంచికలో)

# ప్రార్థన వేదిక



**1. ఆర్.రాజమణి - భీమవరం**
యల్.ఐ.సి డబ్బులు వచ్చుట కోసం

**2. జి.కెంపురత్నం - నిడదవోలు**
కుమారుల రక్షణ, వ్యాపారాల అభివృద్ధి కోసం

**3. బి.ఆల్బర్ట్ రత్నస్వామి - గూటి**
పిల్లల చదువులు, ఉద్యోగాల కోసం

**4. కె.క్రిష్టోఫర్ - కొత్తగూడెం**
ఉద్యోగం స్థిరంగా కొనసాగటం కోసం

**5. ఆర్.యల్.రావు - విశాఖపట్నం**
పిల్లలందరి రక్షణ కోసం

**6. రేణుకమ్మ - మదనపల్లి**
కుటుంబం అందరి కోసం

**7. డి.జోనాతాన్ - రామచంద్రపురం**
ఆరోగ్యం కోసం

**8. కె.ఫణిరాజు - రాజమండ్రి**
పిల్లలు, వారి కుటుంబాల కోసం

**9. కె.ప్రిస్కిల్ల - బుట్టాయగూడెం**
కుమారుడు, భరత్, బన్నిల కోసం

**10. కె.సంజీవ్‌కుమార్ - విశాఖపట్నం**
భార్య ఆరోగ్యం కోసం

**11. బి.రాజారావు - మాచర్ల**
కుటుంబం కోసం

**12. బి.బాబురావు - కామవరపు కోట**
సేవలో అభివృద్ధి కోసం

**13. టి.బాలమణి - కిర్లంపూడి**
ఆరోగ్యం, ఇల్లు, పిల్లల చదువుల కోసం

**14. ఆర్.సరోజిని - తూర్పుగోదావరి**
ఆరోగ్యం, పిల్లల చదువుల కోసం

**15.బి.దేవిడ్ - వెలుగోడు**
పిల్లల ఆరోగ్యం, వారి భవిష్యత్తు కోసం

**16. ఎ.యస్.ప్రభావతి - అనంతపురం**
ప్రసన్న సంతానం, నవీన్ ఆరోగ్యం వివాహం కోసం

**17. పి.రాజు - తణుకు**
కుటుంబం కోసం

**18. యస్.శారాభాయి - రాజమండ్రి**
రాజేష్ కుమార్ కుటుంబ కోసం

**19. వి.అనుపమ - విశాఖపట్నం**
భారతి, శ్యాం, సందీప్ & కుటుంబం కోసం

**20. ఎ.ఆశీర్వాదం - త్రిపురాంతకం**
చిన్నకుమారుని కుటుంబం కోసం

**21. యమ్.లీలమ్మ - జమ్మలమడుగు**
మనుమలు అందరి కోసం

**22. ఆర్.యన్.స్వామి - వరంగల్**
రావలిసిన డబ్బు వచ్చుట కోసం

**23. వి.యం.ప్రభావతి - హైదరాబాదు**
కుమార్తె వివాహం కోసం

**24. పి.రవికుమార్ - నిడదవోలు**
గర్భఫలం, తమ్ముళ్ళు, తల్లిదండ్రులు కోసం

**25. పి.అప్పలరాజు - అరకులోయ**
పెద్దకుమార్డు చదువు,వివాహం, కుమార్తె స్వస్థత కోసం

**26. యల్.తిమోతినాయుడు - భీమునిపట్నం**
పరిచర్య కోసం

**27. బి.దీనమ్మ - సామర్లకోట**
అమ్మగారి ఆరోగ్యం కోసం

**28. సి.హెచ్.ఈసేబు - నెల్లిమర్ల**
హార్టుఎటాక్ స్వస్థత కోసం

**29. పి.మేరీ - మదనపల్లి**
కడుపులో గడ్డ కరిగిపోవునట్లు కోసం

**30.టి.దేవకుమారి - జి.కొండురు**
అనూష ఆరోగ్యం, రక్షణ కోసం

## మెదడుకు మేత

# బబులోను పట్టణపు వ్యాపార వస్తువులు 30

**ప్రకటన 18 అధ్యా 11-17**

కూర్పు – పాస్టర్ పి.ప్రతాప్ కుమార్

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| త | పు | వు | లు | శు | వు | బ | ట్ట | నె | ర్ణ | వ | బ | బ | దా |
| స్తు | లు | లు | వ | డి | దా | లు | ర | ట్ల | క | మ | లు | క్క | రం |
| బం | ద | వు | ట్ట | వెం | గా | మ | ను | ఇ | ను | ము | చె | దా | ష్యు |
| లు | ల్చి | న | స్తు | బ | మె | ధు | త్త | ష్యు | త్న | న | పిం | గు | లు |
| లు | ము | లు | మొ | వ | గు | గో | లు | ము | ల్చి | కు | ట్ల | ణి | మ |
| స | సు | త్న | ట్టె | ధూ | పు | రం | అ | దా | త్త | ము | రు | యి | ము |
| ప | న్న | దా | ర | గొ | సాం | త | దా | బ్బ | లు | క్క | ను | మొ | చె |
| లు | శు | పు | ను | ము | బ్రా | ఫ | దం | ఊ | ద్రూ | ము | ను | చ | త్య |
| ర | ట్ట | వు | నా | ద్రూ | ణి | మె | త్త | ని | పిం | డి | లు | వ | లు |
| లు | ర | బ | లు | ర | బ్బ | ము | మ | ఓ | ర్ణ | వ | లు | ము | బ్బ |
| బ | ము | స | పు | న్న | బ | ద | క్త | ము | రా | ము | స | లు | ను |
| లు | ప | వ్య | ట్టు | ర్ణ | రా | ట్ట | ర | ళ్ళు | ల | ర | ట్ట | చ | ద్రూ |
| యి | ము | నా | ద్ర | పు | వ | గా | లు | ఫ | క్షా | బ | దా | అ | ట్టు |
| త్య | త్త | ధ | బం | ప | బం | క్త | న్న | ద్రా | ట్టు | ధ | త్త | నె | దా |
| గా | ము | డి | ర | ధ | ధూ | బ్రా | ర | ప | ము | రు | నూ | గు | లు |

1. బంగారము
2. వెండి
3. రత్నములు
4. ముత్యములు
5. సన్నపునార బట్టలు
6. ఉదారంగు బట్టలు
7. పట్టుబట్టలు
8. రక్తవర్ణపుబట్టలు
9. నూనె
10. గోధుమలు
11. పశువులు
12. గొఱ్ఱెలు
13. ద్రాక్షారసము
14. మెత్తనిపిండి
15. చలువరాళ్ళు
16. గుఱ్ఱములు
17. రథములు
18. మనుష్యులు
19. దాసులు
20. ఫలములు
21. దబ్బద్రూను
22. దంతపు వస్తువులు
23. కఱ్ఱ
24. యిత్తడి
25. యినుము
26. దాల్చిన చెక్క
27. ఓమము
28. ధూపద్రవ్యములు
29. అత్తరు
30. సాంబ్రాణి

**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

2. పూర్తిచేసిన గ.ను.క. లు అక్టోబర్ 25లోపు, ఇతర రాష్ట్రాలవారు పత్రిక అందిన వారంలోగా మాకందేటట్లు పంపాలి.

పూర్తి చేసి పంపిన వారి పేరు.........................

స్పందన కోడ్ నంబరు .............................

ఊరి పేరు ............................

## అక్టోబర్ గళ్ళ నుడి కట్టు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ⊗ | 2 | 3 | | ⊗ | ⊗ | 4 | | 5 |
| | 6 | ⊗ | | ⊗ | 7 | | | ⊗ | |
| 8 | | | | | ⊗ | 9 | | ⊗ | ⊗ |
| | | ⊗ | | ⊗ | 10 | ⊗ | 11 | | 12 |
| ⊗ | | ⊗ | ⊗ | 13 | | | | ⊗ | |
| 14 | ⊗ | 15 | ⊗ | ⊗ | | 16 | | ⊗ | |
| 17 | | | | ⊗ | 18 | | | 19 | |
| | ⊗ | | ⊗ | 20 | ⊗ | | ⊗ | | ⊗ |
| 21 | | | ⊗ | | ⊗ | ⊗ | 22 | | |
| | ⊗ | ⊗ | 23 | | | | ⊗ | | ⊗ |

### అడ్డం

2 ఎద్దు తన - - - నెరుగును.....నా జనులు యోచింపరు.

4. అతని నేత్రములు నదీ తీరములందుండు - - - వలె కనబడుచున్నవి.

7. ప్రభువు - - - వరకు దప్పిక కలిగి యుండుడి, చూడుడి. (యకోబు)

8. పాప - - - - - నిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాప శరీరాకారమున పంపెను. (రోమా)

9. హాము మూడవ కుమారుడు. - -

11. యెహోవా - - - గజ గజ వణికింప లేచునప్పుడు.... మనుష్యులు కొండ గుహలలో దూరుదురు. (యెషయా).

13. ఆయనయందు ఈ - - - - పెట్టుకొనిన ప్రతివాడును తన్ను పవిత్రునిగా చేసికోనును. (1యోహను)

17. - - - - లాడుచున్న అవిశెనారను ఆయన ఆర్పడు. (మత్తయి)

18. సర్వధికారి - - - - - ల యందు ఆ ప్రత్యక్షతను కనపరచును. (1తిమోతి)

21. బండను చీల్చగా నీళ్ళు ఉబికి వచ్చెను. ఎడారిలో అవి - - - పారెను. (కీర్తన)

22. - - - యెహోవాను గూర్చిన జ్ఞానముతో నిండియుండును. (యెషయ)

23. మనము - - - - మేలు చేసితిమేని గాని తగిన కాలమందు పంట కోతుము.

### నిలువు

1. - - - - కంటె అధికమైన మేలు మీకు కలుగ జేసెదను. (యెహె..)

3. నా జీవిత కాలమంతయు నేను యెహోవా - - - - లో నివసింప గోరుచున్నాను. (దావీదు)

4. ఇదిగో నా రక్షణకు - - - - - - - దేవుడు. నేను భయపడక ఆయనను నమ్ముకొను చున్నాను. (యెషయా) (తల క్రిందులు)

5. గాతు వాడైన గొల్యాతు సోదరుడు - - (1దినవృత్తాంత)

6. - - - - హృదయము గలవారికి యెహోవా ఆసన్నడు (కీర్తన)

10. దర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున ఏ - - - - నీతిమంతుడని తీర్చబడడు.

12. ఆయన తన చిత్తనుసారముగా చేసిన - - - - చొప్పున సమస్త కార్యములను జరిగించుచున్నాను.

14. యూదులలో ప్రసిద్ధి కెక్కిన ఒక ధర్మశాస్త్రోపదేశకుడు. పౌలు ఈయన పాదాలయొద్ద పెరిగాడు. - - - - -

15. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీన - - - - యుండిడి. కొంచెం గజిబిజి అయినట్టుంది చూడండి. (పేతురు)

16. మనము సంతోషపడి ఆనందించుట - - - (పెద్ద కుమారునితో తండ్రి)

19. - - - - నీ మీదికి వచ్చుచున్నాడు. నీ దుర్గమునకు కావలి కాయుము. (నహుము)


20. ఇరుకు మార్గము పరిశుద్ధులది. - - - మార్గము పాపులది.

# విజయవాడలో ఆర్ఫనేజ్, ప్రార్థన మందిరము

**స్పందన-సేవియర్స్ హార్ట్‌బీట్ పరిచర్యలలో దేవుని మహిమార్థమై అనేక కార్యక్రమాలు చేపట్టాము అంటే అది మా ప్రియ పాఠకుల ప్రార్థనలు, ఆర్థిక సహకారం. దేవునికి స్తోత్రాలు.**

ప్రస్తుతం విజయవాడ, గుణదల, ఇ.యస్.ఐ హాస్పటల్ రోడ్‌లో 4.5 సెంట్ల స్థలం తీసుకోటానికి ప్రభువు కృప చూపారు. ఈ స్థలంలో ప్రార్థనా మందిరం ఒకటి, లిటిల్ ఏంజల్ హోం-అనాధ, పేద పిల్లలకు ఒక నివాసం ఏర్పాటు చేయాలని తలస్తూ ప్రార్థిస్తున్నాము.

మందిరానికి సుమారుగా 8 లక్షలు, పిల్లల ఆశ్రమానికి మరో 5 లక్షలు ఖర్చవుతాయని ఇంజనీర్ల అంచనా! మా పాఠకులందరూ ఈ విషయమై మాతో ఏకీభవించి ప్రార్థించాలని మనవి చేస్తున్నాము. అలాగే ఈ పనిలో సహకరించాలని, ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే మీ సేవాకానుకలు పంపి సహకరించాలని మనవి.



GROUND FLOOR PLAN PRAYER HALL

లక్షరూపాయలు ఇవ్వగలిగిన వారు
13 మంది కావాలి, లేదా

50 వేలు ఇవ్వగలిగిన వారు
26 మంది కావాలి, లేదా

25 వేలు ఇవ్వగలిగిన వారు
52 మంది కావాలి, లేదా

10 వేలు ఇవ్వగలిగిన వారు
130 మంది కావాలి, లేదా

5 వేలు ఇవ్వగలిగిన వారు
260 మంది కావాలి.

**మీరిచ్చే ఎంత చిన్న మొత్తమైనా ఈ సేవలో గొప్ప సాయమని మరువకండి. కొన్ని వేలమందికి మన పత్రిక ప్రతి నెలా అందుతుంది, ఇన్ని వేలలో ఏ కొద్దిమంది ఈ సేవకు ముందుకు వచ్చినా సులభంగా ఈ నిర్మాణాన్ని పూర్తి చేయవచ్చును. పరమపదించిన మీ ప్రియుల పేరు మీద గాని, మీరు ప్రేమించి అభిమానించే మీ తల్లిదండ్రులు, పిల్లల జ్ఞాపకార్థం గాని నిర్మించాలని ఆశిస్తే మమ్మును సంప్రదించండి.**

**ముఖ్యంగా ప్రార్థించండి, ఈ సేవలో మీ వంతు కర్తవ్యమేమిటో ప్రభువును అడగండి. ప్రభువు మిమ్మును ప్రేరేపించిన ప్రకారం ఈ సేవలో సహకరించాలని మనవి.**

మరిన్ని వివరాలకు

## స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక

**ఇ.యస్.ఐ హాస్పటల్ రోడ్, గుణదల, విజయవాడ - 520004**

RNI No: 32106/76 Regd No. VJ/057/2009-11
Licenced to post without pre-payment No. PMG/VJ/PWPP/21/2009-11

తప్పక వీక్షించండి

# స్పందన టి.వి. కార్యక్రమాలు

| శుభవార్త ఛానెల్‌లో | ఆరాధన ఛానెల్‌లో | విజయవాడ - సువార్త ఛానెల్లో |
|---|---|---|
| బుధవారం | శనివారం | సోమ-శుక్రవారం వరకు |
| రాత్రి 8:30 గం॥లకు | రాత్రి 10 గం॥లకు | రాత్రి 9 గం॥లకు |

వీనుల విందైన సంగీతం
ఆశీర్వాదం కలిగించే ఆత్మపూర్ణ సందేశాలు
మీ కుటుంబం కోసం ప్రత్యేక ప్రార్థనలు
'అడిగారు కాబట్టి' మీ ప్రశ్నలకు జవాబులు
వార్తలు - వాఖ్యలు 'మారిన జీవితాలు' సజీవ సాక్ష్యాలు

దైవజనులు ప్రసంగించి మీ కొరకు ప్రార్థిస్తారు.

ఒక్కో కార్యక్రమానికి సుమారుగా 10 వేల రూపాయలు ఖర్చవుతుంది. ప్రభువు మిమ్ములను ప్రేరేపిస్తే మీ సేవా కానుకలు పంపి సహకరించండి.

మరిన్ని వివరాలకు: డా॥ దేవసహాయం దండల

# లిటిల్ ఏంజల్స్ హోమ్



అనాధ, పేద పిల్లల ఆశ్రమము

చిన్న పిల్లలను ఆటంకపరచ వద్దు. దేవుని రాజ్యము ఇలాటి వారిదే (బైబిలు)



వివరాలకు : డా॥ దేవ లిటిల్ ఏంజల్స్ హోమ్

గమనిక : చెక్కులు, డ్రాఫ్టులు పంపించేవారు SPANDANA పేరు మీద పంపించ మనవి

స్పందన, పోస్ట్ బాక్స్ 815, గుణదల, విజయవాడ - 520 004